
# మిసిమి

మాస పత్రిక



వెల రూ.3/-

ఏప్రిల్ 1992

# AN MP'S EARNINGS

| | | |
|---|---|---|
| Salary | : | Rs. 1,500 per month |
| Allowance (when Parliament or a committee meeting is in session) | : | Rs. 150 per day |
| Constituency allowance | : | Rs. 3,000 per month |
| Office expense | : | Rs. 1,000 per month |
| Telephones: two, plus free calls worth | : | Rs. 4,000 per month (approximately) |
| Residence: accommodation worth a monthly rent of Rs. 4,000 - Rs. 1 lakh | : | Available at highly subsidised rate of Rs. 1,000 or less per month or even for free |
| Travel allowance | : | Cash amount difficult to compute. 16 free air tickets a year, plus railway passes for member and spouse |
| Medical facilities | : | Access to a medical centre in the Parliament annexe-which has all laboratory and x-ray facilities-and other first-aid centres, plus entitlement to all the medical facilities grade I central government officers enjoy including treatment |

# మిసిమి

"All that we are is the product of what we have thought," is "We are what we think." – Dammapada.

సంపుటి 2 | ఏప్రిల్ 1992 | సంచిక 33

## విషయసూచిక

కళాపూర్ణోదయ సిద్ధాంత ప్రబంధము - నాగళ్ళ గురుప్రసాదరావు

తాత్త్వికులు - డా॥ ఎన్. ఇన్నయ్య

కాపీ కొట్టడంకూడా ఒక కళా? - మన్నాటి

మనస్సును మలచుకోవడానికి మెలకువలు - అట్లూరి వెంకటేశ్వరరావు

విద్వేషం లేనే లేదు - చీమకుర్తి శేషగిరిరావు

విడిప్రతి 3/- వార్షిక చందా రూ.40/-

ముఖచిత్రం
శివ తాండవము

ప్రముఖ రచయిత, చిత్రకారుడు
అడవి బాపిరాజు చిత్రణ

Printed, Published and Edited by Shri ALAPATI RAVINDRANATH for and at Kala Jyothi Process Pvt. Ltd., 1-1-60/5, Iftekar Mansion Lane, R.T.C. X Roads, Musheerabad, Hyd-20. Ph. 612436, 612337.

**Editorial NEST**

B-15, Journalist Colony, Jubilee Hills, Hyderabad-500 034. Ph. 247717

# LIVING DICTIONARY
## (DEVIL'S DICTIONARY)

*Compiled by*
AMBROSE BIERCE (1911)

**Benefactor,** *n.* One who makes heavy purchases of ingratitude, without, however, materially affecting the price, which is still within the means of all.

**Berenice's Hair,** *n.* A constellation (Coma Berenices) named in honor of one who sacrificed her hair to save her husband.

**Bigamy,** *n.* A mistake in taste for which the wisdom of the future will adjudge a punishment called trigamy.

**Bigot,** *n.* One who is obstinately and zealously attached to an opinion that you do not entertain.

**Billingsgate,** *n.* The invective of an opponent.

**Blackguard,** *n.* A man whose qualities, prepared for display like a box of berries in a market-the fine ones on top-have been opened on the wrong side. An inverted gentleman.

**Blank-verse,** *n.* Unrhymed iambic pentameters-the most difficult kind of English verse to write acceptably; a kind, therefore, much affected by those who cannot acceptably write any kind.

**Bore,** ***n.*** *A person who talks when you wish him to listen.*

***Botany,*** *n.* The science of vegetables-those that are not good to eat, as well as those that are. It deals largely with their flowers, which are commonly badly designed, inartistic in color, and ill-smelling.

**Bottle-nosed,** *adj.* Having a nose created in the image of its maker.

**Boundary,** *n.* In political geography, an imaginary line between two nations, separating the imaginary rights of one from the imaginary rights of the other.

**Brahma,** *n.* He who created the Hindoos, who are preserved by Vishnu and destroyed by Siva-a rather neater division of labor than is found among the deities of some other nations. The Abracadabranese, for example, are created by Sin, maintained by Theft and destroyed by Folly. The priests of Brahma, like those of the Abracadabranese, are holy and learned men who are never naughty.

**Brain,** *n.* An apparatus with which we think that we think. That which distinguishes the man who is content to *be* something from the man who wishes to *do* something. A man of great wealth, or one who has been pitchforked into high station, has commonly such a headful of brain that his neighbors cannot keep their hats on. In our civilization, and under our republican form of government, brain is so higly honored that it is rewarded by exemption from the cares of office.

**Brandy,** *n.* A cordial composed of one part thunder-and-lighting, one part remorse, two parts bloody murder, one part death-hell-and-the-grave and four parts clarified Satan. Dose, a headful all the time. Brandy is said by Dr. Johnson to be the drink of heroes. Only a hero will venture to drink it.

**Bride,** *n.* A woman with a fine prospect of happiness behind her.

**Brute,** *n.* See HUSBAND.

# కళాపూర్ణోదయ సిద్ధాంత ప్రబంధము

నాగళ్ళ గురుప్రసాదరావు

*(శ్రీ నాగళ్ళ గురుప్రసాదరావు* ***1933****వ సం.లో జన్మించారు. మద్రాసు విశ్వవిద్యాలయం నుండి ఉపాధ్యాయపట్టాని పొందారు. వివిధ విద్యాసంస్థలలో ఆయా పదవులు నిర్వహించి, విజయవాడ సిద్ధార్థకళాశాలలో ఆంధ్రశాఖాధిపతిగా వ్యవహరించారు.*

*సాహిత్యము, చరిత్ర, తత్త్వశాస్త్రము గురుప్రసాదరావుగారి అభిమాన విషయాలు. 'భారతి'లో, తెలుగుదినపత్రికలలో చాలారోజులు గ్రంథసమీక్షలు చేశారు. వారు వ్రాసిన వ్యాసములు ప్రముఖ పత్రికలలో ముద్రితాలైనవి.*

*ప్రాచీన నవీనసాహిత్యములపట్ల సమానమైన అనురాగం కలవారు. గ్రాంథికభాషావాదియైనా, వ్యావహారిక భాషాప్రయోజనాన్ని గుర్తించినవారు. సాహిత్య ప్రపంచంలో మూఢవిశ్వాసాలకు తావులేదని, సాహిత్యము వర్గాలను, వర్ణాలను మించినట్టిదని వీరి యభిప్రాయము.*

*కట్టమంచి, రాళ్ళపల్లి చూపిన దారులలో ముందుకు పోయే సాహిత్యవిమర్శకులు.)*

★ ★ ★

''ఊహించి తెలియరాకుండ సూరపరాజు
శ్రమ గళాపూర్ణోదయము రచించె''

అని తెనాలి రామకృష్ణుడు, పింగళిసూరన్న రచించిన కళాపూర్ణోదయమును గూర్చి యొకమాట యన్నట్లు పండితలోకమున వదంతి యున్నది. అతడు నైషధమును గూర్చి, ఆముక్తమాల్యదను గూర్చి, వసుచరిత్రమును గూర్చి యిట్టి యభిప్రాయములనే వెల్లడించెను. ఈవిధముగా రామకృష్ణుడు కొంటెకోణంగియై తాను రచించిన పాండురంగమాహాత్మ్యము గొప్పతనము చాటుకొనుటకే యనుచితప్రసంగము చేసెనని విమర్శకులు సరిపుచ్చుకొన్నప్పటికి, నతని వాక్యములలో నొక కొంత వాస్తవము లేకపోలేదు. ఏవిధముగా జూచినప్పటికిని గళాపూర్ణోదయము విలక్షణమయిన - కాదు విశిష్టమయిన - ప్రబంధము. అది సమకాలిక సాహిత్యపద్ధతిని దాటి యవతరించిన కావ్యము. ప్రతిభ - వ్యుత్పత్తి - అభ్యాసము అను మూడు కావ్యకారణములు పుష్కలముగా గలిగిన యొక మహాకవి, కొన్నివందల యేండ్లు ముందుగా లోకస్థితికి నిదానమయిన స్త్రీపురుషుల శృంగారము నందలి వివిధములయిన యంతస్తులను జ్ఞానచక్షువుతో దర్శించి, వానిని యనితరసాధ్యముగా వర్ణించిన ప్రణయప్రబంధము. ఇతిహాస, పురాణ, కథాసరిత్సాగరాదులలోని కథలు చాలవని నిశ్చయించుకొని సూరన తన ప్రణయ దర్శనము ప్రకటించుటకు విశేషమయిన యాత్మప్రత్యయముతో విస్తృతమయిన యొక కథను సృష్టించుకొనెను.

ఇది మూడు జన్మములకు ముడిపడిన కథ. దీనిలో చిన్న సన్న పాత్రలు దాదాపు నలువది యున్నవి. మరియు నిది కథానాయకురాలి రెండవ జన్మముతో మొదలగును. తరువాత నామె మొదటి, మూడవ జన్మములు వర్ణితములగును. అందువలన దీనిని విమర్శకులు 'పద్యరూపమగు నవల' యని కొనియాడిరి.

కాని కళాపూర్ణోదయము ఇప్పటి తెలుగు నవలల వంటిది గాదు. దానిని రచించిన సూరన సూక్ష్మాతిసూక్ష్మ గతులతోగూడిన మానవజీవితమును దర్శించి, దాని పరమార్థమును గుర్తించి గ్రహించినవాడు. ఇతరుల తృప్తికి వ్రాసినవాడు గాడు. సాహిత్య ప్రపంచమున స్థిరపడిన సంప్రదాయములకు భిన్నముగా రచనము చేయగలిగిన ధీరుడు. ఒక మహార్థము నావిష్కరింప వలయునను లక్ష్యశుద్ధిగల మహాకవి. కావ్యశాస్త్రలక్షణములు కమనీయముగా నొకచోట కుదురుకొన్న ప్రబంధమును రచించిన ప్రతిభాశాలి.

కావుననే యొకతడవ చదివినంతమాత్రమునఁ గళాపూర్ణోదయ మర్థముగాదు. కనీసము దానిని మూడుసారులయిన శ్రద్ధతో పూర్వాపరములు సమీక్షించుకొనుచుఁ జదువవలెను. ఈవిధముగాఁ జదువుటకు ఓర్పు నేర్పు కావలెను. అవి లేనప్పుడు రామకృష్ణుని మాదిరిగా అవిచార రమణీయముగా అనుకొనుట తప్పదు. ఆ వికటకవి మాటలు ప్రాచీనకాలమున సాహితీప్రపంచమున వ్యాప్తికి వచ్చిన యభిప్రాయములకు మచ్చుతునకలు. అయినను గళాపూర్ణోదయమునకు వ్యాఖ్య రచించినవారు లేకపోలేదు. అసంపూర్ణములయిన యా వ్యాఖ్యానములు ప్రాచ్యలిఖిత పుస్తక భాండాగారములో నున్నవి.

ఏది యేమయిన ఆంధ్రదేశములో మొదటినుండి కళాపూర్ణోదయమునకు రావలసినంత కీర్తి రాలేదు. ఆ కావ్యము నుద్ధరించిన ఖ్యాతి మహామనీషి కట్టమంచి రామలింగారెడ్డిగారికే చెందును. విప్లవకములయిన యభిప్రాయములు గల వారు పిండికొట్టినట్టు కళాపూర్ణోదయము చదివి, యందలి కవితావిలాస వైచిత్రిని, పాత్రపోషణ వైభవమును 'కవిత్వతత్త్వ విచారము'నందు వెల్లడించిరి. అప్పటికిగాని యాంధ్రపండితలోకము కన్ను తెఱవలేదు. అది మొదలుకొని యెందఱో విద్వాంసులు కళాపూర్ణోదయమును తఱచి చూచిరి. వారిలో ఓరుమళ్ళ అచ్యుతరావు, మల్లాది సూర్యనారాయణశాస్త్రి వెంపరాల సూర్యనారాయణశాస్త్రి, దువ్వూరి వేంకట రమణశాస్త్రి, కాశీభట్ట బ్రహ్మయ్యశాస్త్రి, కాశీభట్ట సుబ్బయ్యశాస్త్రి, పింగళి లక్ష్మీకాంతము మున్నగువారు ముఖ్యులు.

జి.వి. కృష్ణరావుగారు కళాపూర్ణోదయముపై సిద్ధాంత ప్రబంధమును రచించుటకు ముందే, దానిని గూర్చి వెడలిన విమర్శవాఙ్మయము కొంత యున్నది. అది గ్రంథరూపమున, వ్యాసరూపమున వెలుగు చూచినది. వానిని రచించిన విద్వాంసుల వాక్యములనే యితరులు చిలుకపలుకులవలె వల్లించుట సదాచారమైనది. ఇంక కళాపూర్ణోదయమును గూర్చి యెవరైన చెప్పవలసిన దేమున్నది? యని విద్వాంసుల మనుకొనువారు భావించిరి. వారిమాటలు యథార్థములని విశ్వసించిన సామాన్యపాఠకులును గలరు. ఒక విధమయిన జడస్థితి యేర్పడినరోజులలో ఈ సిద్ధాంతప్రబంధమును రచించి కృష్ణరావుగారు సంచలనము సృష్టించిరి. ఒక క్రొత్తచూపుతో కళాపూర్ణోదయమును చదువవలసియున్నదని వారి సిద్ధాంత ప్రబంధమును నిష్పక్షపాతముగా, కూలంకషముగా జదివినవారు, చదివినవారి మాటలు విన్నవారు విశ్వసించిరి. కళాపూర్ణోదయమునకు సంబంధించినంతవరకు మొదట రామలింగారెడ్డిగారి మాదిరిగా, తరువాత కృష్ణరావుగారు

సూరన కావ్యకళాపరమార్థమును స్వానుభవమును బట్టి చిత్తశుద్ధితో, గుర్తించుటకు యత్నించి కృతకృత్యులైరి. కాని వారి పోకడలు వేఱు.

కృష్ణరావుగారు కళాపూర్ణోదయము నొక మహాకవి రచనముగా గుర్తించి, యాతని కళాసిద్ధాంతములను దర్శించి, భారతీయసాహిత్య విశిష్టలక్షణములను తెలిసికొని, అలంకార శాస్త్రతత్వమును గ్రహించి యీ సిద్ధాంతప్రబంధమును రూపొందించిరి. పురస్సిద్ధాంతము లతో వారు కళాపూర్ణోదయమును చదువలేదు. దానిని విమర్శింపలేదు. ఈ సిద్ధాంత ప్రబంధములో వారు అచ్చమయిన ''సహృదయుడు''గా గోచరింతురు. తెలుగువారి విమర్శలో వెల్లడియయిన - వెల్లడియగుచున్న - దోషములు వారికి తెస్సగా దెలియును. కావుననే వారీవిధముగా వ్రాసిరి.

'If the past judged the work of art on the basis of extraneous and dogmatic principles, the present is also probably committing the same mistake by applying a new set of ideologies and idiosyncracies' (Page 101)

"If the past has judged the poets from the point of view of Sanskrit Literature, the present is perhaps repeating it from the standpoint of western criticism. Added to this, modern critics, influenced by the west, appear to estimate a poet taking some other poet as an absolute criterion." (Page 103)

కృష్ణరావుగారు కోరినదెల్ల వస్తునిష్ఠమయిన విమర్శ. విమర్శకుడేది చెప్పుచున్నను, దానికి కవి రచించిన కావ్యమే యాధారము కావలయును. జ్ఞానము - వ్యక్తి, వస్తువు అను రెండిటిని ఆశ్రయించినట్టిది. పంచదార తియ్యగా నుండునను జ్ఞానము పంచదారనే కాక, దానిని తిను వ్యక్తినిగూడ ఆశ్రయించి యుండును. జ్వరము వచ్చిన వ్యక్తికి అది చేదుగా నుండును. జ్ఞానమువంటిదే సౌందర్యమును.

"When such is the meaning, every cultured man will try his level best to improve or adjust himself to every work of art so that he may have as full a vision of its beauty as possible. He keeps aside his personal whims and fancies, likes and dislikes, theories and opinions, and closely follows the artist step by step" (Pages 100, 101)

కావ్యము స్వయంసంపూర్ణక మయిన నిర్మాణము. అంగములన్నియు అంగితో నెడతెగని బంధము కలిగియుండవలెను. అంగములకు స్వతంత్రమయిన యునికి లేదు. అవి అంగికి సహాయులు మాత్రమే. కవి యీ చూపుతోడనే కావ్యమును రచించును. పాఠకుడీ చూపుతోనే కావ్యమును జదువవలెను.

"In the whole process the rules and methods followed are strictly those of the artist" (Page 101)

నూరన ప్రభావతీప్రద్యుమ్నములో (ఆ 2. పద్య 3)

"ఒకటఁబూర్వోత్తరవిరోధ మొందకుండఁ
దత్తదవయవవాక్యతాత్పర్యభేద
ములు మహావాక్యతాత్పర్యమునకు నొసరఁ
బలుకనేర్చుట బహుతపఃఫలము గాదె."

అని యనెను. ఆ మాటల కుదాహరణముగా కావ్యసృష్టి చేసెను. దానిని విమర్శించి మంచి సెబ్బరలు విడమర్చి చెప్పెడివారు ఆ మహాకవి మాటలు పాటింపవలయును. కావ్యము నుండియే కావ్యవిమర్శన సూత్రములు వెలువడుననియు, విమర్శకుడు వానినే ప్రమాణముగా స్వీకరింపవలయు ననియు కృష్ణరావుగారి సిద్ధాంతము. ఈ సిద్ధాంతమే వారి సిద్ధాంతప్రబంధ నిర్మాణమునకు అస్థిభారము. కళాపూర్ణోదయమును గూర్చి వారేమి చెప్పినను అది యా కావ్యనిర్మాణమును, దాని లక్షణములను దాటి, యితర విషయముల నాశ్రయింపకుండ జెప్పినట్టిదే. కావుననే యితరవిద్వాంసులు పనికిరానివని ప్రకటించిన ఘట్టములు కళాపూర్ణోదయమున అతిముఖ్యములని కృష్ణరావుగారు నిగ్గు తేల్చిరి. ఒకటి, రెండుదాహరణములిత్తును.

కళాపూర్ణోదయము ఎనిమిది యాశ్వాసముల కావ్యము. సూరన కథను జెప్పిన రీతికి, పాత్రపోషణము గావించిన పద్ధతికి, పాత్రలనోట బలికించిన పలుకులకు ముగ్ధులయిన కట్టమంచి రామలింగారెడ్డిగారు "షష్ఠాశ్వాసములోని 189వ పద్యము వఱకు నుండునంత ప్రౌఢముగ దరువాతి భాగములు లేవు. ఈ గ్రంథ మంతటితో సమాప్తి జేసియున్న సమ్మాన్యతరమై యుండును. ఏడవ, ఎనిమిదవ యాశ్వాసములలో భావనాశక్తి, ప్రతిభ మొదలగు కవిత్వమూలశక్తులు బలహీనములు" (కవిత్వతత్త్వవిచారము. పుట 185) అని ఖరాఖండిగా జాటిరి. మల్లాది సూర్యనారాయణ శాస్త్రిగారిదియు రామలింగారెడ్డిగారి బడియే. వారును షష్ఠాశ్వాసము నందలి 192వ పద్యముతో "...కళాపూర్ణోదయకథ సమాప్తము - తక్కిన భాగమును మధురలాలసా పరిణయ మనియో, కళాపూర్ణవిజయ మనియో పిలువవచ్చును" (కళాపూర్ణోదయము. పుట 365) అని పరోక్షముగా రెడ్డిగారిని సమర్థించిరి. వాస్తవమునకు శాస్త్రిగారి 'భావప్రకాశికాటీక' యింతటితో ముగిసిన దనవచ్చును.

కృష్ణరావుగారు వీరిరువురతో నేకీభవింపలేదు. కవిత్వమున రమణీయవర్ణనములు ముఖ్యాంగములని ప్రపంచము నందలి విమర్శకు లెల్లరు నంగీకరించినట్టిదే. అట్టి వర్ణనములు షష్ఠాశ్వాసము తరువాత నున్నవి. పురోహితుడు కళాపూర్ణునితో మాటాడిన తీరు, యుద్ధ దృశ్యములు, స్వగృహోన్ముఖులయిన సైనికుల మనఃప్రవృత్తి సరసముగా వర్ణితములయ్యెను. కళాపూర్ణుడు కారణ మెట్టిదయినను - స్వల్పకారణమునకే సంగ్రామములు సంభవించు నని మనము మఱవరాదు - దండయాత్రలుచేయుట రాజనీతి. యావద్దేశమును చక్రవర్తి క్షేత్రముగ సంభావించురాజు దండయాత్రలు చేయక తప్పదు. సత్త్వదాత్ముడు కళాపూర్ణునకు రాజనీతి సవినయముగా నుపదేశించుట సహజము. మధురలాలస శిశువుగా నున్నప్పుడు పెక్కు కథ లుపన్యసించి, మణిహారము బొమ్మ నుండి తొలగుటచే దరువాత నేమియు జెప్పలేకపోయెను. పాఠకునకు దెలియవలసిన యంశములు కొన్ని మిగిలిపోయెను. వానిలో సుగ్రహుని కథ ముఖ్యము. శిశువు కథలెట్లు

చెప్పగలిగెను? చెప్పుచు చెప్పుచు నడుమనేల యాగిపోయెను? దానికి హేతువేమి? మృగేంద్రవాహనాలయమున మణికంధరుడేల తన వీణను భద్రముగా దాచెను? ఈ ప్రశ్నములకు సమాధానము షష్ఠాశ్వాసము తరువాత గాని లభింపదు. కాన యా భాగము ప్రధానకథతో విడరాని చిక్కనిపొత్తు కలది యగుచున్నది. కావుననే కృష్ణరావుగారు

> "No purpose will be served by viewing artistic creations with the bias of the modern age" (Page 121)

> "These considerations, therefore, lead to the opinion that the critic might not have approached the poem from a proper angle" (Page 129)

అని స్పష్టముగా వక్కాణించిరి.

కళాపూర్ణోదయములో మణికంధరుని తీర్థయాత్రావిధానము, పంచమాశ్వాసములో యోగయోగాంగములు సుదీర్ఘముగా వర్ణింపబడెను. విమర్శకు లీరెండింటి వర్ణనము కథాగమన నిరోధకమని తేల్చి చెప్పిరి. కాని కృష్ణరావుగారు వారి వాదమును గాదనిరి. మణిస్తంభుడు మణికంధరుని వృత్తాంతమును కలభాషిణికి చెప్పుచు, అతని తీర్థయాత్రలను విపులముగా వర్ణించెను. దుష్టసంకల్పముతో వచ్చిన యాతని దివ్యశక్తుల యెడ నమ్మిక గలిగి, కలభాషిణి యతని ననుసరించి వెళ్ళుట కీ ఘట్టము మిక్కిలి తోడ్పడును. కథాపురోగమనమునకు సహాయకారి యగును. మధురలాలస శిశువుగా నున్నప్పుడు కళాపూర్ణుని యాస్థానములో సరస్వతీచతుర్ముఖ విలాసాదికథలు వక్కాణించెను గదా! అప్పుడట యలఘువ్రతుఁడున్నాడు. అతడీ శిశువు మహిమ కాశ్చర్యము పొందెను. కాని యా మహిమలను గూర్చి యాతని కింకను సంశయము లుండనేయున్నవి. ఇంకను ఆ శిశువు నొరసి చూచుట కాతడు

"సకలబోధములకు నిధివి
నీవెఱుంగనియవి లేవెవ్వి యోగముల్
చెప్పవలయు....." (ఆ 5. పద్య 141)

నని శిశువు నడిగెను. అందుల కామె యోగయోగాంగములు వివరించెను. శ్రోతయగు అలఘువ్రతుని వైపు నుండి చూచిన ఈ వర్ణనము ప్రకరణోచితమే యగును. కొందఱెదుటివారి గొప్పతనము నంతతొందఱగా నంగీకరింపరు గదా! ఈ ఘట్టము సూరన లోకజ్ఞతకు నుదాహరణమని కృష్ణరావుగారి తలంపు. ఈవిధముగా నితర విమర్శకులు - ముఖ్యముగా కట్టమంచి రామలింగారెడ్డిగారు - కళాపూర్ణోదయములో ఏవి దోషములని వక్కాణించిరో, యవి గుణములే యని కృష్ణరావుగారు సోపపత్తికముగా రుజువు చేసిరి. వారు కళాపూర్ణోదయమునెంత సూక్ష్మదృష్టితో పరిశీలించిరో పాఠకులకిట్టే బోధపడును. కథాప్రధానమయిన కావ్యముగా గాక, మహోత్తమ మయిన కళాసృష్టిగాఁ గళాపూర్ణోదయమును పరిగణించిననే తప్ప, యీ రహస్యము లర్థముగావు. ఈ రకమయిన పరిశీలనమునకు ఆద్యులు కృష్ణరావుగారే.

అష్టమాశ్వాసమున లక్ష్మీనారాయణ సంవాదము కలదు. దానిలో విశిష్టాద్వైత బహూకారము, అన్యమతనిరాకారము గలవు. ఈ ఘట్టము నిష్ప్రయోజనమని రామలింగారెడ్డి

గారనగా, కృతిపతిమెప్పుకొలుకు స్వార్థముతో వ్రాయబడినదని యితరులనిరి. కృష్ణరావు గారు తాత్త్వికముగా ఆ ఘట్టమును సమర్థించిరి. సూరన "విశిష్టాద్వైతమతము ననుసరించి కళావిర్భావ విధానమును వర్ణింప నిశ్చయించినవాఁడు," అని వా రీ సిద్ధాంత ప్రబంధమున ప్రతిపాదింప నమకట్టిరి. కావుననే యీ లక్ష్మీనారాయణ సంవాదము సూరన తాత్పర్యమున కత్యావశ్యకముగా చూపట్టినది. ఇతర విమర్శకులు చూపిన దోషముల నెంతగా ఖండించినను, కృష్ణరావుగారు వారి వాదమునందలి యౌచిత్యమును గుర్తించిరి. కావుననే వా రీ విధముగా వ్రాయగల్గిరి:

"The episode of Lakshmi-Narayana-Samvada is definitely out of place and betrays one-sided outlook while the description of Manikandhara's pilgrimage, Madhuralalasa's marriage, and Kalapurnodoya's expedition and conquest are somewhat lengthy. Apart from these three minor faults Kalapurnodayam is superb and unique"

(page 358)

ఈ వాక్యములు కృష్ణరావుగారి సమచిత్తతకు, గుణగ్రహణపారీణతకు నిదర్శనములు. కళాపూర్ణోదయము మీఁద సాగిన విమర్శకు మొదట విమర్శకుల పఠనానుభూతియే మూలద్రవ్యము. కవిపక్షమునుండి యీ కావ్యమును సమీక్షించి, దానికి నూతనవ్యాఖ్యానము చేయఁగా కృష్ణరావుగారు సంకల్పించిరి. కావుననే కళాపూర్ణోదయము నందలి ప్రతి సన్నివేశము సప్రయోజనముగా వారి బుద్ధికి పొడకట్టినది. అయినప్పటికి ఆ సన్నివేశముల దోషములను గూడ వారు చాటిరి. ఈ విధముగా సహృదయతతో గుణాగుణములను జూపిన విమర్శకులెందఱో లేరు.

మహాతాత్పర్యము కలిగిన కళాపూర్ణోదయకథను సూరన స్వతంత్రముగా సృష్టించెనా? అనగా ఉత్పాద్యమా? లేక యాయన యితర గ్రంథముల నుండి దానిని స్వీకరించెనా? అనగా ప్రఖ్యాతమా? ప్రఖ్యాత మయిన కథను గ్రహించి దానిని తాను వెల్లడింప నిశ్చయించిన జీవనపరమార్థమునకు అభివ్యక్తిసాధనముగా మలచుకొనెనా? అనగా మిశ్రమా? ఈ ప్రశ్నములకు విమర్శకులు తమ యూహాపోహలనుబట్టి యెవరికి తోచినట్లు వారు సమాధానములు చెప్పిరి. బాణుని కాదంబరి, కథాసరిత్సాగరము, లింగపురాణము, మార్కండేయ పురాణము, ప్రబోధచంద్రోదయము, మనుచరిత్రాది కావ్యములు కళాపూర్ణోదయకథ కాధారములని వారు నిర్ణయించిరి. కృష్ణరావుగా రీవిషయమును నాలుగువైపుల నుండి పరిశీలించిరి. ఈ గ్రంథములలోని ఘట్టములు కొన్ని సూరన కాధారములు కావచ్చుననియు, ఇప్పట్ల ఆయన ఆ సత్యమును మఱుగుపుచ్చక యంగీకరించె ననియు వారు చెప్పిరి. మొత్తముమీద కళాపూర్ణోదయకథ సూరన యొక్క అసాధారణభావనాశక్తికి ఫలముగా ప్రభవించిన దని వారు సోదాహరణముగా నిరూపించిరి. వారి మాట లిట్లున్నవి:

"......There is no dearth of evidence to show that the Kalapurnodayam is the product of the poet's own imagination. The so-called sources can be interpreted in different ways but it can be maintained that they cannot be called regular sources.

At the most, some of them may be considered as having influenced in the construction of the world's best stories; and those influences of which he is consciously aware have been duly acknowledged by him by way of suggestion....." (Page 77)

ఈ యాధార గ్రంథములలో నొక కథాసరిత్సాగరమే సూరన కెక్కువగా నుపయోగపడి నదని వారు నిర్ణయించిరి.

ఇక కళాపూర్ణోదయకథకు మూడు రకములయిన యంతరార్థములు కలవని విమర్శకులు చెప్పిన మాటలను కృష్ణరావుగారు జాగ్రత్తగా పరిశీలించిరి. ఆధ్యాత్మిక, కాముక, చారిత్రికము లయిన అంతరార్థములను ప్రతిపాదించుటయే సూరన లక్ష్యమని యా విమర్శకులు రుజువు చేయుటకెంతో ప్రయత్నించిరి. కళాపూర్ణుని వృత్తాంతము శ్రీకృష్ణదేవరాయల రాచఱికమును ధ్వనింపజేయుచున్నదట! ఇట యంతరార్థము ఆంగ్లభాషయందలి "Allegory" అను పదమునకు పర్యాయపదము. కృష్ణరావుగారు Allegory మూలతత్త్వమును ముట్టి, విమర్శకుల రాద్ధాంతముల యందలి బలహీనతలను వెల్లడించి, కళాపూర్ణోదయ కథ కే యంతరార్థము లేదనిరి. ఈ కావ్యము ద్వ్యర్థికావ్యము కాదు, త్ర్యర్థికావ్యము కాదు, శ్లేషకావ్యము గాదని నిరూపించిరి. అంతరార్థము కావ్య మందంతటఁగాని యేకదేశమునఁగాని యొక క్రమము ననుసరించి యుండవలయును. అస్పష్టత యెక్కడ నుండరాదు. ఇది Allegory యొక్క ప్రధాన లక్షణము. విమర్శకులు నిరూపించిన త్రివిధార్థములొక క్రమము ననుసరించి లేవు. స్వాభిప్రాయములు సూరన కతిదేశించిన తీరు వారి మాటలలో కనబడును. కృష్ణరావుగారీ సందర్భమున

Whatever may be the drawbacks of ancient Telugu poets, they can never be charged with obscurity like Spenser, Browning and others"

(Page 97)

అని యొక గొప్పమాటను చెప్పిరి. ఛందస్సు పరిపూర్ణముగా భావ వ్యక్తీకరణకు సాధనము గాఁజాలదని యెలుగెత్తి చాటు నేటి బాలవిమర్శకులు వారి మాటలు చెవిని బెట్టుట మంచిది.

కృష్ణరావుగారు పాత్రపోషణము, కథాపాత్ర భూమిక, సన్నివేశ సంవిధానము, మున్నగు అంశముల యందే కళాపూర్ణోదయ విశిష్టత నాన్యతోదర్శనీయముగా గోచరించుచున్నదని విపులముగా నిరూపించిరి. ఇప్పట్ల పాత్రల పేరులు కథతో ఎట్టి యవినాభావ సంబంధము కలిగియున్నవో చక్కగా వివరించిరి. దీనికి వారు పెట్టినపేరు నామవక్రత. కళాపూర్ణోదయ మునందు సరస్వతీచతుర్ముఖుల శృంగారము వర్ణిత మయ్యెనుగదా! ఆ దేవతామూర్తుల శృంగారచేష్ట లన్నియు భూలోకమున మూర్తులు ధరించి ప్రభవించినవి. ఒక్కొక్క చేష్ట యొక్కొక్క ప్రాణి యయ్యెను. ఆ ప్రాణి తదనుగుణముగా సార్థకమయిన పేరు పొందెను. కళాపూర్ణుఁడు, మణిస్తంభుఁడు, మదాశయుఁడు, స్వభావసిద్ధుఁడు, అభినవకౌముది, మధురలాలస, రూపానుభూతి మున్నగు పాత్రములన్నియు ఆ యాదిమదంపతుల విలాసచేష్టలలో ఒక్కొక్కదానికి ఒక్కొక్క సజీవరూపము. ఆ పాత్రములకా పేరులు

తప్ప యితరములయిన పేరు లుండుటకు వీలు లేదు. మణికంధరుఁడు మొదలయిన పేర్లు గూడ నిట్టివే. ఆ గంధర్వునికి మణికంధరుఁ డన్నపేరు గాక మఱియొకపేరు పెట్టినచో కలభాషిణి తాను నలకూబరుని ప్రేమించుచున్నదాన నను అత్మవంచనకే పాల్పడదు. నలకూబర సమాగమము కొఱకు మణిస్తంభుని వెంట పోయి కరవాలఘాత ముతో మరణించి యుండెడిది గాదు. అనఁగా కళాపూర్ణోదయకథయే యుండెడిది గాదు. ఆ విధముగనే శాలీనునకు మణిస్తంభుఁడను వ్యవహారనామ మేర్పడకపోయినచో, సుముఖాసత్తి యను నామాంతరము పొందిన సుగాత్రి తన భర్తను మృగేంద్రవాహనాలయ ములో గుర్తించి యుండెడిది. అప్పుడు మణిస్తంభుఁడు పైదుచేసి కలభాషిణిని ద్వారకనుండి తీసికొని వచ్చుటకుఁగాని, తదనంతర కథ ప్రవర్తిల్లుటకుఁ గాని యవకాశ ముండెడిది గాదు. ఈవిధముగా కథతో నీరక్షీరములవలె కలిసిపోయిన పాత్రల పేర్లను సృష్టించెను. కథనుబట్టి పేర్లు, పేర్లనుబట్టి కథ రూపొందినది.

సూరన కథాసంవిధానములో మఱియొక విశేషము గోచరించును. ఆయన మొదట దుర్ఘటకార్యములను వర్ణించును. ఆ వర్ణనములు బోడితలకు మోకాలికి ముడిపెట్టినట్లులుం డును. వీనివలన పాఠకుడు విభ్రాంతి విచికిత్సలకు లోబడును. కాని తుదకు సూరన తన సంవిధాన చాతుర్యముతో ఆ దుర్ఘటకార్యములకు చిక్కని ముడి వేయును. సుగాత్రీశాలీనుల వృత్తాంతమే దీనికి తార్కాణము. సుగాత్రి తనకు సంతానము కలుగునట్లు, శాలీనుఁడు తనకు ఆమెవల్ల సంతానము కలుగకుండునట్లు సరస్వతీదేవి నుండి వరములు పొందుదురు. ఇవి పరస్పర విరుద్ధములు. కాని యా వరము లిచ్చినది సరస్వతీదేవి గదా! అవి వ్యర్థము లగుటకు వీలులేదే! సూరన అటు సరస్వతీదేవి వాక్కునకు, ఇటు నాయికానాయకుల శీలమునకు భంగము కలుగకుండ ఆ రెండు వరములకు సాఫల్యము చేకూర్చును. ఇది యథార్థమగు నొక యింద్రజాలమే.

ఈ విధముగా కృష్ణరావుగారు కళాపూర్ణోదయకథా కవితా శిల్పరహస్యముల నిరవశేషముగా బయటబెట్టిరి. ఇతర విమర్శకులు వీనియందలి కొన్ని యంశములను తడవక పోలేదు. కాని కృష్ణరావుగారి చూపు వేఱు. కళాపూర్ణోదయము నందలి ప్రత్యంశము కావ్యమహాతాత్పర్యమునకు అనుగుణముగా నున్నదని నిరూపించుట వారికే చెల్లినది. కళాపూర్ణోదయ విమర్శ సాహిత్యమున నిది యపూర్వము.

ఇది యంతయు నొక యెత్తు. కృష్ణరావుగారు కళాపూర్ణోదయము కళావతారవిధాన మును అభివ్యక్తీకరించు చున్నదని కావించిన నిరూపణము మఱియొక యెత్తు. ఈ నిరూపణము వారి యుపజ్ఞకు ప్రబల నిదర్శనము. వారి సిద్ధాంతప్రబంధములో 250వ పుట నుండి చివరిదాక ఈ రహస్యమే విపులముగా ప్రబలములయిన యుపపత్తులతో బయటఁబడినది. కృష్ణరావుగా రిట్లనిరి.

"As it has been pointed out on many an occasion, the central idea or the theme of the Kalapurnodayam is the complete emergence of art. That is to say the complete process by which a work of art conceived by the poet in accordance with the laws of beauty finds outward artistic expression" (Page 250)

సూరన కళావిర్భూతి యెట్లు జరుగునో కళాపూర్ణోదయమున నొక మహాకథా ముఖమున నిరూపింప నిశ్చయించెను గదా! మఱి యాయన యే తాత్త్విక సత్యము ప్రాతిపదికగా ఈ నిరూపణము గావించెను? అని యెవరైన ప్రశ్నింపవచ్చును. విశిష్టాద్వైతదర్శనము నాధారముగాఁ జేసికొని సూరన కళావతార మెట్లు జరుగునో వివరించెనని కృష్ణరావుగారి సిద్ధాంతము. ఇది వారి కల్పనము గాదు. మఱి గట్టిగా నున్న తొమ్మిది యుపపత్తులతో వారు ప్రతిపాదించిన కళాలీల. 252వ పొరటలో కృష్ణరావుగా రాయుపపత్తులను జూపిరి. మణికంధరుని వృత్తాంతము, సుముఖాసత్తి మణి స్తంభులను నామధేయములు, సరస్వతీచతుర్ముఖుల లీల, కవి శాస్త్రవ్యసనాతిధన్యులగు వారి సాయము కావ్యప్రచారము కొఱకర్థించుట, విశిష్టాద్వైత ప్రతిపాదనము, కావ్యమీమాంస మున్నగున వన్నియు ఆ యుపవత్తులలోనివే. కావున కృష్ణరావు గారి సిద్ధాంతము కేవల మూహగాక, కళాపూర్ణోదయ కావ్యమూర్తి ననుసరించి సాక్షాత్కరింపఁజేసికొనిన సత్యమగుచున్నది. వారు తన యభిప్రాయములను సూరన కారోపింపలేదు. తన మాటల నాయన కంటగట్టలేదు.

సౌందర్యము సర్వేశ్వరుని యనంత కళ్యాణ గుణములలో నొక గుణము. అది శాశ్వతము. పరిణామదూరము. విశ్వజనీనము. అనేకత్వమున ఏకత్వముతో విరాజిల్లున ట్టిది. సుందర సృష్టి సర్వేశ్వరుని రూపమే. దేశకాలబద్ధుడగు జీవుడు గావించు సౌందర్యసృష్టి సర్వేశ్వరుని సౌందర్యగుణమునకు రూపాంతరమే. సర్వేశ్వరుడు తన విభూతిని జీవుడు చేయు సౌందర్య సృష్టి ద్వారా ప్రదర్శించును. జీవునిపై సర్వేశ్వరుడు కరుణ చూపును. తత్ఫలముగా జీవుడు సౌందర్యావిష్కరణమునకు పూనుకొనును. అతడు సర్వేశ్వరుడు ఏకైక శరణ్యుడని విశ్వసించి, తదనుగ్రహార్హము పాటుపడవలయును. దీనికి భక్తియే సాధనము. దీనికి చరమఫలము మోక్షము.

"When beauty is a quality and a beautiful object a mode of Brahman, the artist is only an instrument selected by Him for its manifestation. One will be selected to be an artist either by one's great merit or by divine grace. Barring these two, there is no other way open to become a genuine artist" (Page 334)

"As Brahman is the ultimate goal and the very basis of the universe and as the creative faculty is the gift of divine grace, the poet or any artist must create in a spirit of complete devotion to Him"

(Page 335)

"Thus poetry or any Art devoted and dedicated to Brahman will certainly, Surana opines, put the agent on the path of Bhakti, the royal road to release or Moksha"

(Page 336, 337)

కలభాషిణి, నారద, మణికంధరుల వృత్తాంతములు పయి సిద్ధాంతముల కుదాహరణములు. కళాపూర్ణుని వృత్తాంత మంతయు కళావిర్భూతియే. అది సరస్వతీ చతుర్ముఖుల లీల. ఈ విధముగా కృష్ణరావుగారు కళాపూర్ణోదయము కళావతార విధానమును ప్రతిపాదించుచున్నదని సిద్ధాంతీకరించిరి.

మొదట మార్క్సుదొరగారి చూపుతో కృష్ణరావుగారు సాహిత్యమును సమీక్షించిరి. హేతువాదము నాశ్రయించిరి. కాని వారంతతో ఆగలేదు. ప్రాచ్యపాశ్చాత్య శాస్త్రములను జక్కగా జదివిరి. దర్శనములలో పండితులైరి. సాహిత్యవిషయమున వారు పిడివాదములు చేయలేదు. మొండి పట్టుదల చూపలేదు. ఎక్కడ సౌందర్యమున్నదో దానిని వారారాధించిరి. వారి హృదయ ప్రవృత్తి గిడుగుబాఱినట్టిది గాదు. వారి సాహిత్య సంస్కృతి యంతయు కళాపూర్ణోదయ సిద్ధాంత ప్రబంధమున గోచరించును. నేటి సాహిత్యవిమర్శకులు నేర్చుకోదగిన యుత్తమవిషయము లెన్నియో దీనిలో నున్నవి. ★

# Indian Communist Role in changed political scene

In any case, the CPI and the CPM are no longer what they used to be. The whole ambience of left politics in the country has changed since the day Mr Gopalan described the President's first address to Parliament as "a declaration of war on the Indian people." The Left parties today feel embarrassed to recall how, echoing the Chinese, they called Mr Nehru "a running dog of imperialism". Now Mr Jyoti Basu has included Netaji Bose in his party's list of great radicals.

Sham Lal in Times of India

---

The collapse of communism does not guarantee the permanent, universal triumph of capitalism and democracy.

TIME

---

★ ★ ★

ఆధునిక తాత్త్విక ఆద్యులు

# నేను వున్నాను అంటే, ఆలోచిస్తున్నాను గనుకనే! డేకార్ట్ పద్ధతులు

- డా. ఎన్. ఇన్నయ్య

అంధకారయుగాల నుండి బయటబడిన యూరోప్‌లో క్రైస్తవాన్ని కదిలించివేసే శాస్త్రజ్ఞులు బయలుదేరారు. కోపర్నికస్, కెప్లర్, గెలీలియో కనుగొన్నవన్నీ బైబిల్ సత్యాల్ని కూల్చివేశాయి. పునర్వికాసం అన్నిరంగాల్లో తొంగిచూచింది. తార్కిక ఆలోచనలు వచ్చాయి. శాస్త్రీయ పద్ధతికి బేకన్ ఎంతో వూతం యిచ్చాడు. పాత ఆలోచనలు కదలిపోయాయి. శాస్త్రజ్ఞుల్ని క్రైస్తవం అదరగొట్టినా, భావాల బలాన్ని ఆపలేకపోయింది. ఇటలీలో పునర్వికాసం విజృంభించింది. క్రైస్తవంలో తిరుగుబాటు ధోరణులు కనిపించాయి. శాస్త్రీయ పద్ధతి బలపడసాగింది. ప్రాపంచిక అనుభవ వాదంతో హాబ్స్ తన తత్వాన్ని వెలుగులోకి తెచ్చాడు. అలాంటప్పుడు ఆధునికతత్వానికి నాంది పలికే రీతుల్లో ఫ్రెంచి తత్వవేత్త రేని డేకార్ట్ కొత్త పద్ధతులు ప్రవేశపెట్టాడు. అందుకే ఆధునిక తత్వానికి ఆయన శ్రీకారం చుట్టాడంటారు.

తత్వశాస్త్రం ఆధునిక యుగంలోకి మలుపు తిరిగింది. అక్కడ నిలబడి రేని డేకార్డ్ దారిచూపాడు. యూరోప్‌లో పునర్వికాసం, సంస్కరణ ముమ్మరంగా జరిగి గ్రీక్, రోమన్ సంస్కృతుల సారాంశాన్ని అందుకున్నారు. అంధకారయుగం దాటి వెలుగు చూచారు. కోపర్నికస్, బేకన్ వంటివారు ఆలోచనల్ని మార్చివేశారు. గణితాన్ని తాత్వికంగా ఆలోచించిన రేని డేకార్ట్ రావడంతో ఆయన ఆధునిక తత్వానికి బాసికం కట్టాడన్నారు. హేతువాదంతో మార్మికత్వాన్ని రంగరించి, మంచి శైలిలో తత్వాన్ని అందించిన డేకార్ట్, పాతను కొత్త తొడుగులతో చూపక, తాను ఆలోచించి కనుగొన్నది చెప్పాడు. ఏకాంతాన్ని, ప్రశాంతాన్ని కోరుకున్న డేకార్ట్, ఒక చలికాలపు రాత్రి పొయ్యి దగ్గర వెచ్చగా ఆలోచిస్తూ తన తాత్విక ఆలోచనలకు రూపురేఖలు దిద్దుకున్నట్లు రాసుకున్నాడు. (1619 నవంబర్ 10)

ఫ్రాన్స్‌లో ఒకఉన్నతవంశంలో పుట్టినడేకార్ట్ (మార్చి 31 - 1596) జెసూట్ కేథలిక్ విద్య అభ్యసించాడు. రేఖాగణితం, తత్వం, భౌతికశాస్త్రం చదివాడు. అప్పటికిఇంకా సైన్స్ - తత్వం విడిపోలేదు. తండ్రి నుండి సంక్రమించిన స్థిరాస్తులు అమ్మేసి డచ్ సైన్యంలో చేరాడు (1617); తరువాత బవేరియన్ సైన్యంలో వుండగా తాత్విక చింతనలో పడ్డాడు. 1621లో సైన్యం వదలి పారిస్‌లో కుదురుకున్నాడు. మళ్ళీ 1628లో సైన్యంలో చేరాడు. ఇలా సైనికజీవితం గడుపుతుండగా ఆధునికతత్వానికినాంది పలికాడు.

హోలండ్ లో ప్రశాంత జీవనం గడుపుతూ స్వేచ్ఛను బాగా అనుభవించిన డేకార్ట్ (1629-49) గలీలియోకు మతస్తులు పట్టించిన గతి విని, తాను మతవ్యతిరేకంగా రాసిన గ్రంథాన్ని దాచేశాడు. భూమి తిరుగుతున్నదనీ, విశ్వం అనంతం అనీ రాసిందంతా ఆయన జీవిత కాలంలో వెలుగు చూడలేదు. ఆయన భావాలు నాస్తికత్వానికి చేరువలో వున్నాయని హోలండ్ లో ప్రొటెస్టెంట్ లు దాడిచేశారు.

డేకార్ట్ రచనలు - ముఖ్యంగా ప్రేమ, ఆత్మ గురించి రాసినవి - స్వీడన్ రాణి క్రిస్టీనా చూచి ఆకర్షితురాలై తన కొలువులో వుండమని ఆహ్వానించింది.

రాణికి పాఠాలు నేర్పుతూ, అక్కడి చలిని తట్టుకోలేక 1650 ఫిబ్రవరిలో చనిపోయాడు

## డేకార్ట్ ఆలోచనా రీతి

నేను ఆలోచిస్తున్నాను, అంటే నేను వున్నానన్న మాట. మిగిలిందంతా భ్రమ కావచ్చు. కాని నా ఆలోచన వాస్తవం. నా ఆలోచన వాస్తవం అనేది ఉత్తరోత్తరా ఆత్మాశ్రయవాదులు బాగా వాడుకున్నారు. నేను ఆలోచించకపోతే నేను లేను గనుక నాలో ఆత్మ వున్నదన్నాడు. ఇంత స్పష్టంగా నిర్దుష్టంగా వున్న దేదైనా వాస్తవం అని నిర్ధారణకు వచ్చాడు. ఆలోచన వలన సందేహాలు వస్తాయి; అవగాహన లభిస్తుంది; కలలు వస్తాయి; భావనలు రేకెత్తుతాయి. ఇవన్నీ మనస్సుకు చెందినవి. అయితే శరీరంలో ఇంద్రియాల వలన లభించే జ్ఞానం గందరగోళానికి దారితీయవచ్చు. మనస్సు గ్రహించి చెప్పేదే స్పష్టమైన జ్ఞానం.

ద్వంద్వ సత్యాన్ని డేకార్ట్ ప్రతిపాదించి ఆమోదించాడు. మనస్సు, పదార్థం రెండూ వాస్తవాలే. వీటిని దేనికి అవే అనే దృష్టితో పరిశీలించవచ్చు.

నేను ఆలోచిస్తున్నాను గనుక నేను ఉన్నాను - అనే బదులు నేను నడుస్తున్నాను. కనుక నేను ఉన్నాను అనొచ్చుగా! డేకార్ట్‌కు యిలాంటి అభ్యంతరాలు ఎదురైనా అతడు ఆలోచనకే ప్రాధాన్యం యిచ్చాడు. నడవకుండానే, ఆలోచనలో నడుస్తున్నాను అనుకోవచ్చు. కాని ఆలోచించకుండా, నేను ఆలోచిస్తున్నాను అనుకోలేం. కనుక ఆలోచన కచ్చితంగా నాకున్న ప్రత్యేక విలక్షణం అని డేకార్ట్ గుచ్చి చెప్పాడు.

## డేకార్ట్ పద్ధతి

తెలుసుకోడానికి మనం అనుసరించేది ఎక్కడైనా ఎప్పుడైనా ఒకే రీతి. తెలిసిన దానినుండి మొదలుపెట్టి జటిలమైన వాటిని అవగాహన చేసుకుంటాం. జ్ఞానానికి, ప్రప్రథమంగా కావలసిందేమిటి? స్పష్టంగా తెలిసిన విషయం. కొన్ని ప్రతిపాదనలు ఎంత స్పష్టం అంటే, వాటిని గురించి మనం ప్రశ్నించం. శూన్యం నుండి ఏదీరాదనేది ఇలాంటిదే, ఇలాంటి వాటినుండి రాబట్టే ఆలోచనలు తర్కంలో నిగమన సూత్రాలంటాం. ఎక్కడైనా అవగాహనలోపిస్తే, ఆగిపోయి ఆలోచించాలే గాని, ముందుకు గుడ్డిగా సాగిపోరాదన్నాడు. డేకార్ట్ తన తాత్విక ఆలోచనల్ని డిస్కోర్స్, మెడిటేషన్స్ అనే రెండు గ్రంథాలలో విపులంగా చర్చించాడు.

నేను ఆలోచిస్తున్నాను గనుక నేను ఉన్నాను అనే ప్రతిపాదనకు యిక రుజువు అక్కరలేదు. ఇది స్పష్టం. ఇది మన ధ్యానచింతన ద్వారా తెలుసుకున్న విషయంగా డేకార్ట్ భావించాడు. నాలో వున్న ఆలోచనలు పరిమితమైనవి, సంపూర్ణమైనవి కావు. ఈ ఆలోచనలు ఎలావస్తున్నాయి. అంటే దైవం వీటిని కలిగిస్తున్నాడని డేకార్ట్ నమ్మాడు.

దైవం అనే ఆలోచన కూడా గర్భితంగా మనిషిలో వున్నదన్నాడు. మన జ్ఞానానికి యిదే పునాది అనుకున్నాడు. మన భావాలన్నింటికీ దైవం మూలం. అది సంపూర్ణం. మన ఆలోచనలు అసంపూర్ణం. డేకార్ట్ వాదనలు మత ప్రాతిపదికలకు దారి తీశాయి. కార్య కారణ వాదాన్ని దైవం వరకూ తీసుకెళ్ళి ఆపేశాడు.

## మత ఆలోచనలు

మన అనుభవం ఆధారంగా దైవాన్ని రుజావు చేయలేమని డేకార్ట్ ఉద్దేశం. తొలి కారణమైన దైవానికి మించి మనం కార్యకారణ వాదాన్ని విస్తరించలేమన్నాడు. సంపూర్ణమైన దైవాన్ని గురించి, అది వున్నదా లేదా అని చెప్పే శక్తి అసంపూర్ణ జీవులకు లేదన్నాడు. దైవానికి కారణం ఏమిటి అనే ప్రశ్నకు డేకార్ట్ సమాధానమిస్తూ, కొన్నింటికి కారణాలు బయట వుంటాయని, దైవానికి కారణం అంతర్గతంగా వున్నదనీ అన్నాడు. దైవం స్వయంభువు అన్నమాట. దైవం వునికికి మరే కారణం అక్కర లేదు.

అయితే సంపూర్ణమైన దైవం నుండి మనలోకి అసంపూర్ణ ఆలోచనలు ఎలా వచ్చాయి? అనే ప్రశ్నకు సమాధానం చెప్పలేక పోయాడు. అసంపూర్ణత దైవసృష్టి కాదా? కాదంటాడు. అది కేవలం అసంపూర్ణమైన వ్యక్తులకే పరిమితం అని వాదించాడు.

## ప్రకృతి తత్వం

మన ఆలోచనకు దారితీసే ఇంద్రియాలు, వెలుపల పదార్థం వున్నాయి. గుణాలన్నీ మన ఆలోచన వలన అంటగట్టే లక్షణాలే. బయట వస్తుప్రపంచమంతా చలనం వలన వివరించవచ్చు. పదార్థాలన్నీ విస్తరణ, విభజన, చలనం అనే గుణాలు కలిగివుంటాయన్నాడు. పరిశీలన, పరిశోధన వలన కార్యకారణ రీతుల్ని కనుగొనవచ్చు. విశ్వజనీనమైన వాటినుండి విడి భాగాలు కనుకొనే తర్కం ఒక్కటే (డిడక్షన్) సరైన పద్ధతి అన్నాడు. ప్రకృతిలో జరిగేదంతా చలన సూత్రాల ఆధారంగా చెప్పవచ్చునని డేకార్ట్ పేర్కొన్నాడు.

చలనం కూడా దైవం నుండే వచ్చిందని డేకార్ట్ సిద్ధాంతీకరించాడు. పదార్థం విస్తరిస్తుంది. చలిస్తుంది. ఈ విస్తరణ అనంతం. ఇలాంటి వాదం వలన తన దైవభావానికి దెబ్బతగులుతుందని డేకార్ట్ గ్రహించలేదు. అయితే దైవసంకల్పం మనకు అతీతమైంది గనుక, దాని జోలికి పోయి వూహించబూనుకోవడం అనవసరమని సరిపెట్టుకున్నాడు.

ప్రపంచమంతా ఒక యంత్రం వంటిదని డేకార్ట్ ఉద్దేశం. ఇందులోని భాగాలన్నీ అనంతంగా వుంటూ వచ్చాయి. పరిణామానికి కూడా యాంత్రిక వివరణ యివ్వడానికి డేకార్ట్ ప్రయత్నించాడు. జీవుల్ని కూడా యాంత్రికంగానే భావించాడు. రక్త ప్రసరణ గురించి అప్పుడే విలియం హార్వే కనుగొన్నాడు. డేకార్ట్ యీ సిద్ధాంతాన్ని బలపరుస్తూ రక్త ప్రసరణ గుండె వలన జరుగుతుందనీ ఇది యాంత్రికమనీ అన్నాడు. ఈ వాదనే శరీరంలోని ఇతర భాగాలకూ డేకార్ట్ అన్వయించాడు. జంతువులలో జరిగే దంతా యాంత్రిక రీతేనన్నాడు. వాటికి ఆత్మ లేదన్నాడు. ఆత్మ కేవలం మానవుడికే పరిమితం చేశాడు. శరీరం పదార్థ లక్షణాలతోనూ, ఆత్మ ఆధ్యాత్మిక గుణాలతోనూ వున్నట్లు డేకార్ట్ చిత్రించాడు.

మెదడులోని వినాళ గ్రంథిని ఆత్మ స్పందింప చేస్తుందని, ఆ గ్రంథి నుండి ఆత్మకు షాక్‌లు వస్తాయనీ డే కార్ట్ చెప్పాడు. ఇదెలా జరుగుతుందో వివరించలేకపోయాడు. ఆత్మకూ పదార్థానికీ వుండే సంబంధం ఆయన వూహకు, నమ్మకానికీ చెందిందే తప్ప, తర్కానికి అందుతుందే తప్ప, రుజువుకు నిలబడదు. డే కార్ట్ ద్వంద్వ వాదానికి యిక్కడే తీవ్ర దెబ్బతగిలింది. ఆత్మను వినాళ గ్రంథి కదలించగలదంటే, ఆత్మను కూడా పదార్థం క్రిందకు అనుకోకుండా డేకార్ట్ కుదించేశాడు.

జ్ఞానం వలన మనం సంపూర్ణతలో భాగమని గ్రహిస్తామని, అందువలన సమాజం, కుటుంబం, రాజ్యంలో మనం కూడా వున్నట్లు తెలుసుకుంటామనీ డేకార్ట్ అన్నాడు. మానవుడు తన శక్తులను, వాటి అవధులు గ్రహిస్తాడు.

డేకార్ట్ గణితశాస్త్రం అధ్యయనం చేయడమే గాక, రేఖాగణితానికి ఎంతో సేవచేశాడు. ఇందులో విశ్లేషణ పద్ధతి ప్రశంసనీయం. ఆల్జీబ్రాను రేఖాగణితానికి వినియోగించడం గొప్ప తీరుగా భావిస్తారు. బిందువును రెండు రేఖల దూరాన్ని బట్టి నిర్ధారించే కో ఆర్డినేట్స్ పద్ధతిని కార్టీజియన్ పద్ధతిగా నేటికీ పేర్కొంటారు.

డేకార్ట్ గొప్పతనం ఏమిటి అంటే రెండు విషయాలలో స్పష్టంగా చెప్పవచ్చు. ఒకటి ప్రతిదీ సందేహించడం; రెండవది స్పష్టమైన అవగాహన అవసరమని నిర్ధారించడం. నాకేమి తెలుసు, నేను సందేహించగలిగిందేమిటి అనేవి డేకార్ట్ వేసిన గొప్ప ప్రశ్నలు. నాకెన్నో నమ్మకాలుండొచ్చు. వీటి వెనుక ఏముందో చూడాలి. ఇందులో ఏవి నిలబడతాయో గమనించాలి. వీటిలో దేహించదగినవి ఏవి? ఇలాంటి ప్రశ్నలతో డేకార్ట్ యూరోప్ తత్త్వాన్ని మలుపు తిప్పాడనవచ్చు. నేనెవర్ని అని ప్రశ్నించుకోవడం, కనిపించేవాటి వెనుక నేను భిన్నంగా వున్నాననుకోవడం కూడా డేకార్ట్ ఆలోచనలో మకుటాయమానమే.

## డేకార్ట్ సారాంశం

డేకార్ట్ పెళ్ళి చేసుకోపోయినా కుమార్తెను ఒకామెతో కన్నాడు. ఆ కూతురు 5 ఏళ్ళకే చనిపోవడంతో కుంగి పోయాడు. ఆ విచారం ఆయన్ను వెన్నాడింది. తాత్విక ఆలోచనలపై ఎంతవరకు ప్రభావం చూపెట్టిందో తెలియదు. కేథలిక్ గానే జీవితం గడిపిన డేకార్ట్, మత శక్తులకు వెరచి తన స్వతంత్ర భావాలు దాచాడు. గలీలియో, బ్రూనో, కోపర్నికస్‌వంటి వారికి మతం పట్టించిన గ్రహణం దృష్ట్యా అతడిలా చేసివుండొచ్చు.

ప్రతిదీ సందేహిస్తూ, ఖచ్చితమైన అవగాహనకు రావాలనడంలో డేకార్ట్, ఒక బుట్టెడు యాపిల్స్ ఉదాహరణ యిచ్చాడు. యాపిల్స్ ఏరి మంచివి అట్టేపెట్టి, చెడ్డవి పారేస్తాం. అలాగే మన నమ్మకాలనే తొలగించి, సందేహాలకు తావిచ్చేవన్నీ త్రోసి రాజన్నాడు. ఇందులో రోజూ చూస్తున్న సందేహాలు కొన్ని. నీళ్లలో కర్ర వంగినట్లు కనిపించడం, కంటి చూపులో దోషం వుంటే విచిత్ర రంగులు కనిపించడం మామూలు విషయాలే. ఇవి తొలుత పరిష్కరించుకోవాలి. రెండవ దశలో కలలు వచ్చినప్పుడు కనిపించే దృశ్యాలు, లేచి చూస్తే భ్రమలనిపిస్తుంది. కలలో చూచినవి నిజమా అనేది పరిశీలించుకోవాలి. మూడో స్థాయిలో మనల్ని తప్పు త్రోవను పట్టించే శక్తివుందా? ఇది మానసిక స్థితికి సంబంధించినట్లు డేకార్ట్ చెప్పాడు. ఇలా పోతుంటే,

తిరుగులేని, సందేహించ వీల్లేని స్థితికి చేరుకుంటామని, డేకార్ట్ తార్కికంగా అన్నాడు. అక్కడ వెనక్కు తిరిగి, జ్ఞానం సమకూర్చుకుంటాం. ఆలోచిస్తాం. ఇతరచోట్ల ఏ శక్తి మనల్ని వంచించినా నా ఆలోచన వున్నదనే విషయంలో మోసగించలేదు. అలా ఆలోచించుకుంటూ దైవభావన దగ్గర ఆగిపోయి, మళ్ళీ ప్రపంచంలోకి వస్తాం. పోయేటప్పుడే ఎన్నో సందేహాస్పద మైనవాటిని తృణీకరించాం గనుక తిరిగి వచ్చేటప్పుడు నిర్దుష్టమైన ప్రపంచానికి చేరుకుంటాం. అదెలాంటి ప్రపంచం? ఉదాహరణకు మైనం ముద్దను ఒక ఆకారం చేసి వుంచుదాం. దానికి రంగు, రుచి, గట్టిదనం వున్నాయి. అదే నిప్పు దగ్గర పెడితే కరిగి ముందున్న లక్షణాలన్నీ మారిపోతాయి. అయినా మైనం వుంది. ప్రదేశం ఆక్రమించుకున్న మైనం కొన్ని మార్పులకు గురైంది. ప్రపంచమూ యింతే. గణితశాస్త్రం ద్వారా ప్రపంచ స్వరూపాన్ని చిత్రించడానికి డేకార్ట్ యిలాంటి ఉదాహరణలిచ్చాడు. పదార్థం మారినా, అసలే లేకుండా పోదు. మన ఆలోచనల ద్వారా ప్రపంచ స్వరూపాన్ని తెలుసుకోవచ్చు.

బెర్నార్డ్ విలియమ్స్ ఉద్దేశంలో డేకార్ట్ ప్రభావం వలన మనం మన ఆలోచనల్ని పునః పరిశీలించి, మనల్ని సరిగా అవగాహన చేసుకొని, ద్వంద్వం నుండి బయటపడ గలుగుతామంటాడు! (ఆధార గ్రంథాలు - డేకార్ట్: మెడిటేషన్స్, డిస్కోర్స్ ఆన్ ది మెథడ్; హాఫ్‌డింగ్: **'హిస్టరీ ఆఫ్ ఫిలాసఫీ'**; బ్రయన్ మాగి: **'ది గ్రేట్ ఫిలాసఫర్స్'**; రస్సెల్: **ది విజ్‌డం ఆఫ్ ది వెస్ట్, హిస్టరి ఆఫ్ ది వెస్టరన్ ఫిలాసఫీ**).

ఆధునిక యూరోపియన్ తత్వం హఠాత్తుగా ఆరంభం కాలేదు. విజ్ఞానం అనేక తీరులుగా పెంపొందడానికి బీజాంకురాలు వేసింది ఇటలీలో పునర్వికాసం. ఉధృతంగా సాగింది. కళలు, ముఖ్యంగా కవిత్వం, శిల్పం, చిత్రకళ, సంగీతం, డ్రామా కొత్త పుంతలు సంతరించుకోవడం గమనించారు. బహుముఖ ప్రజ్ఞాశాలి అయిన లియొనార్డో డి వెంచి విజ్ఞానశాస్త్ర వికాసానికి కృషిచేశారు. కాని పునర్వికాసకాలంలో లలితకళలకు వచ్చిన ప్రాధాన్యం, ప్రాబల్యం, విజ్ఞాన శాస్త్రానికి రాలేదు. మతస్థుల పెత్తనాన్ని, మూఢ నమ్మకాల్ని ప్రశ్నిస్తున్న విజ్ఞానాన్ని ఒక పట్టాన జనం ఆమోదించలేక పోయారు. మేధావులు సైతం వీటినుండి బయటపడలేక పోయారు. కనుక విజ్ఞానం కొద్దిమందికే పరిమితం అయింది.

పునర్వికాస కాలంలో మెకవిల్లి (1469 - 1527) అత్యంత ప్రాధాన్యం పొందిన రాజకీయ సిద్ధాంతకర్తగా పేరొందాడు. ఇతడు రాసిన 'ప్రిన్స్' గ్రంథం (1513) డిస్కోర్సెస్ అనేవి రాజనీతి సూత్రాల్ని పేర్కొని, చాలామందిని దిగ్భ్రాంతి పరచాయి. ఏ విధంగానైనా అధికారాన్ని హస్తగతం చేసుకోవడం ముఖ్యం అనే అతడి సూత్రం అనుభవపూర్వకంగా చెప్పిందే.

పునర్వికాసంలో పేర్కొనదగిన మరో ఇరువురు ప్రధాన వ్యక్తులు ఎరాస్‌మస్ (1466 - 1536), సర్ థామస్ మోర్ (1478 - 1535). మోర్ మానవవాది కాగా, ఎరాస్‌మస్ సంస్కరణవాది. క్రైస్తవ మతాన్ని, పోప్‌ను ఎరాస్‌మస్ తన 'ది ప్రైజ్ ఆఫ్ ఫాలీ'లో తీవ్ర విమర్శకు గురిచేశాడు. తన 'యుటోపియా' రచనలో మోర్ ఆస్తి అందరిపరంగా వుండాలని, సమానత్వం కోసం కమ్యూనిజం కావాలంటాడు.

జర్మనీలో సంస్కరణవాదం ప్రబలగా, స్పెయిన్‌లో అందుకు విరుద్ధవాదం వచ్చింది.

పోప్‌కు, కాథలిక్ మతానికి వ్యతిరేకంగా మార్టిన్ లూథర్ ఎదురు తిరిగాడు. లయోలా కొంతవరకు, కాల్విన్ చాలావరకు, సంస్కరణ వాదానికి తోడ్పడ్డారు. అప్పుడే ప్రొటెస్టెంట్ మతం వ్యాపించింది. అయితే కేథలిక్‌ల లోనే లయోలా బయలుదేరి, జెసూట్ శాఖ ఏర్పరచి, ప్రొటెస్టెంట్ వ్యాప్తికి అడ్డుకట్ట వేశాడు.

పునర్వికాసంలో పేర్కొనదగిన మార్పు విజ్ఞాన శాస్త్రమే. కోపర్నికస్, న్యూటన్, గలీలియో, కెప్లర్ ఇందుకు దోహదం చేశారు. భూమికి ప్రాధాన్యం తొలగించి, సూర్యుడికి కేంద్ర స్థానంయిచ్చిన కోపర్నికస్ (1473-1543) బైబిల్ సిద్ధాంతాల పునాదులు కదలించాడు.

కెప్లర్ (1571-1630) వచ్చి సూర్యకేంద్ర సిద్ధాంతాన్ని యింకా కట్టుదిట్టం చేశాడు. ఖగోళశాస్త్రంలో గ్రహాల చలనం సూత్రీకరించి కెప్లర్ ఎనలేని సేవచేశాడు. గలీలియో (1564-1642) గతి సూత్రాలు రూపొందించి ఆధునిక శాస్త్రానికి తిరుగులేని ప్రాతిపదికలు రూపొందించాడు. క్రైస్తవ మతం యీ శాస్త్రజ్ఞులందరినీ భయపెట్టింది, ఖండించింది. గలీలియోను శిక్షించింది. న్యూటన్ (1642-1727) చలన సూత్రాల్ని, గురుత్వాకర్షణ సిద్ధాంతాన్ని చెప్పాడు. వీరి సిద్ధాంతాలన్నీ మతాన్ని చెదురుమదురు చేశాయి.

ఆధునిక విజ్ఞానంలో ఫ్రాన్సిస్ బేకన్ (1561-1626) ఆగమన సూత్రాల్ని (Induction) ప్రవేశపెట్టి, ఇంకొంచెం ముందుకు తీసుకెళ్ళాడు. జ్ఞానం వలన శక్తిలభిస్తుందని సూత్రీకరించిన బేకన్ 'ది ఎడ్వాన్స్‌మెంట్ ఆఫ్ లెర్నింగ్' అనే రచనలో కొత్త సూత్రాల్ని పేర్కొన్నాడు. విశ్వ సూత్రాలతో మొదలెట్టే బదులు, ఒక్కొక్క విషయం పరిశీలిస్తూ విశ్వ సూత్రాలకు పోయే పద్ధతి అనుసరించాలన్నాడు. ఆధునిక విజ్ఞానంలో ఇదొక చిన్న భాగంగానే ఆమోదం పొందింది.

## హాబ్స్

బ్రిటిష్ తత్వవేత్తగా పేరొందిన హాబ్స్ (1588 - 1679) రాజరికాన్ని సమర్థించిన పదార్థవాది. రాజకీయాల్లో ఆయన తాను రాసిన 'లెవిథియన్'లో నాటి తత్త్వవేత్త డేకార్ట్ వాదాలన్ని ఖండించాడు. మానవులంతా సహజంగా సమానులేనని వాదించాడు. తిరుగుబాటు సమర్థనీయం కాదన్నాడు. సార్వభౌమత్వాన్ని వెనకేసుకొచ్చాడు. అరాచకం కంటె నిరంకుశ ప్రభువు నయం అన్నాడు. రాజును ఎంపిక చేయడంతో ప్రజల బాధ్యత తీరిపోతుందన్నాడు. ఆత్మ రక్షణార్థం, ప్రభుత్వం కోరినా, పోరాటం లోకి వెళ్ళకుండా వుండే హక్కు వ్యక్తికి వుండాలన్నాడు. రాజకీయ పార్టీల్ని హాబ్స్ సమర్థించలేదు. కేథలిక్ పోప్ పెత్తనాన్ని అతడు తృణీకరించాడు. రాజరికాన్ని అత్యుత్తమమైనదిగా సమర్థించిన హాబ్స్, రాజు అధికారాల్ని తిరుగులేనివిగా వత్తాసుపలికాడు.

మతపరమైన మూఢ నమ్మకాల్ని హాబ్స్ ఖండించాడు. జాతి అవసరాలు, ఆసక్తులే వ్యక్తి ఆసక్తిగా అభివర్ణించాడు. తాత్వికుడుగా హాబ్స్, గణిత విధానాల్ని బాగా అమలుపరచాలన్నాడు. ప్రాపంచిక అనుభవవాది గణితాన్ని కావాలనడం విశేషం. సమస్యల్ని తార్కికంగా పరిష్కరించుకుంటూ పోవాలంటాడు. హాబ్స్ విమర్శలను కేథలిక్కులు నిరసించారు. స్వేచ్ఛ కోరే పౌరులు యీసడించారు. మెకవెల్లి తరువాత రాజకీయ సిద్ధాంతకర్తగా హాబ్స్ పేరు తెచ్చుకున్నాడు.★

# కాపీ కొట్టడం ఒక కళా?
# విద్యకూడా లఘు పరిశ్రమా?

- మన్నాటి

మనిషి ఒకప్పుడు కోతి
క్రమక్రమేణా మారాడు - ఆలోచించాడు.
తన జాతికి చెందిన వారితో స్నేహం చేశాడు
సంబంధాలు పెంచుకున్నాడు. సమాజాన్ని ఏర్పరచుకున్నాడు
సంఘజీవి అయ్యాడు.
ఫలానాది తప్పు - ఫలానాది ఒప్పు అన్నాడు.
నీతి - నియమం - నిబంధనలు ఏర్పరచుకొన్నాడు
ఎన్నో ప్రయోగాలు చేశాడు. ఫలితాలు పొందుతున్నాడు
జీవితకాలాన్ని పెంచుకున్నాడు - సుఖంగా బ్రతకటానికే యిదంతా
ఇది ఒక గత చరిత్ర

★ ★ ★

ఈ రోజుల్లో మనిషి వేగంగా ఆలోచిస్తున్నాడు.

క్రీ.శ. ఒకటవ శతాబ్దాన్నుంచి పద్దెనిమిదవ శతాబ్దం వరకూ ఎంత అభివృద్ధి సాధించాడో - అంతకు కొన్నివేల రెట్ల అభివృద్ధి కేవలం గత రెండు శతాబ్దాల్లో సాధించాడు.

జీవితంలో వేగం పెరిగింది - ఆయుస్సు పెరిగింది
ఆలోచనల్లో వేగం పెరిగింది - పేరాశ పెరిగింది
మంచికీ - చెడుకీ అర్థాలుకూడా వేగంగా మారాయి.
నీతి నియమాలకిగూడా సరిహద్దులు మారాయి
నిన్నటి తప్పు నేడు ఒప్పు అవుతోంది
సమాజ నియమాలు రోజు రోజుకీ మారుతున్నాయి
మనీ మార్కెట్‌లో షేర్ల ధరలు నైతిక విలువలు లాగా
అయితే ప్రస్తుత మన పయనం అభివృద్ధి వేపేనా?
అని విజ్ఞులూ, సమాజ పెద్దలు ఆలోచనలో పడ్డారు.

సరే -

వారి ఆలోచనలూ, ఊహలూ ఎలా ఉన్నా - అసలు ఈ రోజుల్లో మనిషి అభివృద్ధికి ఓ ముఖ్యకారణమయిన విజ్ఞానానికీ ఆలోచనకీ దోహదం చేసే ప్రాథమిక అంశమయిన - విద్యారంగంలోని ఒక విష సంస్కృతిని గురించి నమూనాగా ఆలోచిద్దాం ఓసారి.

★ ★ ★

మహాత్మాగాంధీ అంటే ఈ తరం వాళ్ళకి కామిక్ బుక్‌లో కమేడియన్‌లా - సర్కస్‌లో జోకర్‌లా కనపడుతున్నాడనేది నిజం.

చదువుకునే రోజుల్లో ఉపాధ్యాయుడే కాపీ కొట్టమని సలహా ఇచ్చినా ఆయన తిరస్కరించడం ఓ పెద్ద జోక్ ఈ కాలం విద్యార్థులకి.

ఈ రోజుల్లో కాపీ కొట్టడమనేది సర్వత్రా 64 కళల్లో జేర్చతగిన అసామాన్యమయిన కళ.

పెయింటింగ్‌కి పెయింటింగ్ కాపీ - సినిమాకి సినిమా కాపీ - సంగీతంలో కాపీ - వ్యాపారంలో కాపీ - రచనల్లో కాపీ - ఇలా అన్ని రంగాల్లో కాపీ కొట్టడమనేది సాధారణమయిపోయింది. కాపీ కొట్టడమనేది అభివృద్ధి చిహ్నంగా మారింది.

అయితే - ప్రస్తుతం Educationists ని కలవరపెడుతున్న సమస్య ఏమిటంటే విద్యారంగంలో వేళ్ళూనుకు పోయిన కాపీ కళ.

మనదేశంలో - ముఖ్యంగా - మన రాష్ట్రంలో ఎనభైశాతంమంది విద్యార్థులు ఈ కాపీ సంస్కృతికి ప్రయత్నించేవారే

నిజం ఏమిటంటే - తమ పిల్లలకి కాపీ కొట్టడం తప్పు అని బోధించే తల్లిదండ్రులు నూటికి ఎంతమంది వుంటారు? పైగా ప్రోత్సహించే తల్లిదండ్రులే చాలా ఎక్కువ.

నేను ఏడవతరగతి చదివేప్పుడు మా ట్యూషన్ మాస్టర్ ఇంగ్లీష్ పేపర్ 'అవుట్' అయిందంటూ ఆ పేపర్లో వచ్చిన ప్రశ్నలకి జవాబులు చిన్న చిన్న చిట్టీలమీద రాసి అందరికీ ఇవ్వడం నాకు గుర్తుంది.

అసలు విద్యార్థులని కాపీ కొట్టడానికి ప్రోత్సహించే విధంగానే తయారయింది ఇవేళ్టి సాంఘిక వాతావరణం.

విద్యారంగంలో పూర్తి స్థాయిలో అవినీతి పేరుకుపోయింది. LKG నుండి Ph.D థీసిస్‌ల వరకూ డబ్బుకి అమ్ముడుపోతోంది విద్య.

పదివేల కన్నా తక్కువ రూపాయలతో డిగ్రీ సర్టిఫికేట్ దొరుకుతుంది.

రెండువందలకన్నా తక్కువ రూపాయల్తో రేపటి పరీక్షాపత్రం ఈరోజే లభిస్తోంది.

ఇరవైవేల కన్నా తక్కువ ఖర్చుతోనే రెడీమెడ్ థీసిస్‌లు లభ్యమవుతున్నాయి.

ట్యూషన్లు డొనేషన్లూ సామాన్య మానవుణ్ణి అదరగొడ్తున్నాయి.

విద్యారంగంపైన ప్రభుత్వానికున్న నిర్లక్ష్య వైఖరికి ఈ నాలుగు ఉదాహరణలూ చాలు.

పై వ్యాపారాలు చేసేవారు విద్యాధికులే అనే విషయం మరువకూడదు.

"అక్షరం ముక్క రానివాళ్ళు అధికారంలో (ఎలక్షన్ ద్వారా) చేరి అబద్ధపు స్టేట్‌మెంట్స్ ఇవ్వడం - మనల్ని పరిపాలించే వారే పది నాల్కలతో మాట్లాడ్డం చేస్తుంటే - నేను కాపీ కొట్టడంలో తప్పేముంది?" అనేసింది ఓ విద్యార్థిని.

"కష్టపడి చదివి పరీక్షలు రాసినా ఏం లాభం? కాపీ కొట్టేవాడికే నాకన్నా ఎక్కువ మార్కులు వస్తున్నప్పుడు" నసిగాడు ఓ కుర్రాడు.

ఎదిగే మొగ్గల్లాంటి విద్యార్థుల్లో ఈ నిరాశావాదం - అడ్డదారిలో పైకి వెళ్ళాలనే ఆరాటం ఎందుకు కల్గుతోంది? పెద్దలను అనుకరించుచున్నారా?

"రెండు పూటలా తినాలంటే ఉద్యోగం కావాలి - ఉద్యోగం కావాలంటే సర్టిఫికేట్ కావాలి. బ్రతకడానికి కాపీ కొట్టాలి" ఓ అండర్ గ్రాడ్యుయేట్ సులిసూత్రంగా చెప్పాడు.

మరి సంవత్సరం పాటూ చదవుకోవడానికిచ్చిన సమయాన్ని వృథాపర్చుకుని పరీక్షల్లో అడ్డదారిన పాస్ కావాలనుకోవడం తప్పుకాదా - అని ప్రశ్నిస్తే -

"మా లెక్చరర్స్ కూడా మాలాగే పాసయినవాళ్ళు. వాళ్ళు మాకు చెప్పేదేమిటి? అయినా అసలు సంవత్సరంలో కాలేజీ ఎన్ని రోజులు తెరిచి ఉంటుంది?" నిలదీశాడు ఒక విద్యార్థి.

ఏడో తరగతి చదివే కుర్రాడొకడు మొన్న జరిగిన పరీక్షల్లో ఫ్లయింగ్ స్క్వాడ్ రాకముందే తమ ఇన్‌విజిలేటర్

తమకు కాపీ కొట్టడంలో ఏరకంగా సహకరించాడో ఆనందంగా చెప్పుకోవడం నాకు తెలుసు. (తనకు ట్యూషను చెప్పిన మాష్టారు సహాయం ఎంతయినా వుంది).

ఎన్నో రకాలుగా విద్యార్థిలోకం కాపీకొట్టడం తప్పుకాదంటోంది - సమర్థిస్తోంది.

విజ్ఞానం లేని యువత దేశానికి ఎంతకీడు చేస్తుందోననే ఆలోచన మన పాలకులకి రాదు. విద్య - సంస్కారం లోపించిన ఈ దేశభవిష్యత్తు స్పష్టంగా కళ్ళకి కనపడుతున్నా పట్టించుకునే పాలకుడు లేడు. (ఉపాధ్యాయులకు వున్నదా?)

కేవలం మనదేశంలోనే కాదు. అమెరికాలోని వాషింగ్‌టన్‌లో ఈమధ్య 'పీపుల్స్ మేగజైన్' అనే పత్రిక నిర్వహించిన సర్వేలో 50% విద్యార్థులు ఛీటింగ్‌కి పాల్పడుతున్నారని తేలింది. క్లాసులో జరిగే పాఠాలను భద్రపరిచే పాకెట్ కంప్యూటర్స్ జేబులో ఉన్నప్పుడు ఏ విద్యార్థి మనస్సు నిశ్చలంగా ఉంటుంది?

తనకు తానై మనిషి ఏర్పరచుకున్న ఈ సమాజంలోని నియమాలని తానే ఉల్లంఘించి అడ్డదారుల్లో అభివృద్ధి చెందాలని ప్రయత్నించడం జరుగుతోంది. దీనికి హేతువు మనిషిలో పేరుకుపోయిన స్వార్థం అని చెప్పవచ్చు. చివరికి తను కట్టుకున్న భార్య - కన్న కూతుళ్ళ శీలాలనే బలిపెట్టి అభివృద్ధిలోకి రావాలని ప్రయత్నించే నైజం అతగాడిలో చోటుచేసుకోవడం పడగవిప్పి విషపుకోరలు సాచి బుసలు కొడుతున్న స్వార్థానికి పరాకాష్ట

అయితే దాదాపూ చాలాకాలం క్రితం ఒక దినపత్రికలో ప్రచురింపబడిన వార్త ఈ ఛీటింగ్ సమస్యకి ఒక పరిష్కారం ఉందనే ఆశాభావాన్ని రేకెత్తిస్తోంది.

ఒక స్కూల్లో అసలు ఇన్విజిలేటర్లు లేకుండా నిర్వహించిన పరీక్షల్లో ఏ విద్యార్థి కాపీకి పాల్పడలేదనే వార్త అది. అంటే - విద్యార్థులతో మానసికంగా డీల్ చేస్తే వారిని అడ్డదారులు తొక్కకుండా మనం కాపాడగలం అని తేలింది.

దీనికి వ్యక్తిగత శ్రద్ధ చాలా అవసరం. ఉపాధ్యాయుల్లో చిత్తశుద్ధి ముఖ్యం.

కానీ అంత సమయం - శ్రద్ధా - వోపిక మన ఉపాధ్యాయులకి ఉండదు.

ఒక సర్వేలో తేలినదేమంటే - ఎంత అనుభవమున్న ఉపాధ్యాయుడైనా ఒక క్లాసులో 18మంది విద్యార్థులకన్నా ఎక్కువమందిని Control చేయలేడు అని. దురదృష్టవశాత్తు మనదేశంలో 80 కన్నా ఎక్కువమంది విద్యార్థులున్న చోటకూడా ఏకోపాధ్యాయ పాఠశాలలే ప్రభుత్వం నిర్వహిస్తోంది.

కాపీ కొట్టేవాడి బుర్రలో ఏమీ నిల్వ ఉండదనేది నిజం. పిల్లల్లో మంచి అభ్యాసాలు పెంపొందించాలన్నా - మెదడుని వాళ్ళు ఏమాత్రం ఉపయోగించాలన్నా, ముందు జాగ్రత్త తీసుకోవాల్సింది తల్లిదండ్రులే - అది **మొదటి మెట్టు.**

**రెండో మెట్టు ఉపాధ్యాయులది:** చిత్తశుద్ధితో తమ పవిత్ర బాధ్యతని నిర్వర్తించడం - పిల్లల్లో సంఘంపట్ల నిరాశాభావాలు చెలరేగకుండా ఆపడం వాళ్ళు చేయాలి.

**మూడో మెట్టు పాలకులది:** విద్యార్థిలోకాన్ని తమ ప్రయోజనాలకి బలిచేయకుండా వారికోసం - దేశ భవిష్యత్తుకోసం విద్యారంగంలో ఉన్నత ప్రమాణాలు నెలకొల్పే చర్యలని త్వరితంగా తీసుకోవాలి.

**పరిణతి చెందిన విద్యార్థి ఒత్తిడులకి లొంగకుండా ఆసక్తి ఉన్న విషయాన్నే అధ్యయనం చేయడం, తనలో నిజాయితిని పరిశీలించుకోవడం యువకుడైన విద్యార్థి ధ్యేయం కావాలి.**

ఇవి నెరవేరితే కాపీ సంస్కృతి కూకటి వేళ్ళతోసహా కూలిపోతుంది. ఇలాకాక గుడ్డి ఎద్దు పద్ధతిలో మన విద్యావిధానం నడుస్తూ పోతే అది చెరువులో పడడం ఖాయం.

**మనిషి మళ్ళీ తెలివిగల మృగం అవడం అనివార్యం.**

# మనస్సును మలచుకోవడానికి మెలకువలు

- అట్లూరి వెంకటేశ్వరరావు

మనస్సు శరీరంలోని అంగంకాదు. మనస్సుకు కేంద్రస్థానం మెదడు. కాని మెదడు, మనస్సు ఒకటికాదు. మెదడు మన శరీరంలోని భాగం. అందువల్ల దానిని మనం చూడగలం. కాని మనస్సుకు భౌతిక స్వరూపం లేదు. మెదడులోని వెయ్యికోట్ల కణాల పనితీరును సమన్వయపర్చే క్రియనే మనస్సు అంటాం. ఒక క్రియ యొక్క ప్రభావం కన్పిస్తుంది కాని, క్రియను భౌతికంగా చూడలేము. ఉదాహరణకు రెండు రసాయనాలను భౌతికంగా కలిపినప్పుడు సంయోగక్రియ జరుగుతుంది. తత్ఫలితంగా కొన్ని భౌతిక పదార్థాలు ఏర్పడ్తాయి. ఆ సంయోగంలో రసాయనాలలోని అంతర్భాగాలయిన అణువులు, పరమాణువులు అనేక రూపాంతరాలు చెందుతాయి. ఆ రూపాంతరాలను భౌతికంగా మనం చూడలేనప్పటికి రసాయన క్రియను అర్థం చేసుకో కలుగుతాం. అట్లాగే మెదడులోని కోట్లాది కణాలు జరిపే రసాయనిక ప్రక్రియనే మనస్సు అంటాం. మనస్సు చేపట్టే కార్యక్రమాన్ని అనుభూతి ద్వారా మనం తెల్సుకోగలుగుతాం. మనస్సు స్వయం ప్రతిపత్తిగల సమన్వయ క్రియ.

మనస్సును తన పనిని తాను చేయకుండా నిరోధించలేం. మనస్సు నిర్వహించే కార్యక్రమంలో పదోవంతు మాత్రమే మన స్ఫురణలో మెదిలే ఆలోచనలు మనకు తెలియజెప్పుతాయి. మనస్సు నిర్వహించే పనిలో 90శాతం అంతర్ మనస్సులో జరుగుతుంది. అంతర్ మనస్సు పనితీరు మనకు తెలియదు. కాని దాని ప్రభావం బాహ్యమనస్సులో మెదిలే ఆలోచనలపై స్పష్టంగా కనుపిస్తుంది. అంతర్ మనస్సు బాహ్యమనస్సు పరస్పర విరుద్ధప్రేరణలను కలుగజేస్తే, అంతర్గత సంఘర్షణ ఏర్పడ్తుంది. తత్ఫలితంగా మానసిక అస్థిరత గలుగుతుంది. మానసిక సంక్షోభాలకు ఈ అంతర్గత సంఘర్షణే కారణం. అందువల్ల మానసిక సుస్థిరతకు, అంతర్గత సంఘర్షణల ప్రభావాన్ని తగ్గించుకోవాలి. ఇట్టి కృషిలో భాగంగా మనస్సును మలచుకొనే నైపుణ్యాన్ని ప్రతి ఒక్కరు విధిగా సంతరించుకోవాలి. మనస్సును అదుపు చేయలేంగాని, దాని పనితీరులో కొన్ని మార్పులను ప్రవేశపెట్టటానికి వీలు వున్నది. మార్పులను ప్రవేశపెట్టి మనం ఎదురు చూచే ఫలితాలను సాధించటానికి అంచలువారిగా ప్రయత్నించాలి. అట్టి నేర్పును సంతరించుకోవడానికి అనేక అడ్డంకులను అధిగమించాలి. ఇట్టి కృషికి అవసరమయిన విషయ పరిజ్ఞానాన్ని గూర్చి తెలుసుకొందాం.

ఆలోచనలు శక్తి రూపంలో వుంటాయి. అయస్కాంతపు శక్తిని ఇనుప రజనుతో గుర్తించవచ్చు. విద్యుచ్ఛక్తిని లైటుద్వారా ఉపయోగించుకోవచ్చును. ఉపయోగంలోకి వచ్చిన తరువాతే ఆశక్తి యొక్క వునికిని గుర్తించవచ్చు. అట్లాగే ఆలోచనలు ఉత్పన్నమయి, మెదడులోని కణాలను కదిలించిన తరువాతే వాటి వునికిని మనం గుర్తించగలుగుతాం. అందువల్ల ఆలోచనలను ఉత్పన్నంగాకుండా నిరోధించలేం. కాని ఆలోచనలను మనకుపయు

క్తంగా వుండే రీతులలో పయనింపజేయవచ్చు. మనకు నష్టం కలిగించే ఆలోచనలను దారి మళ్ళించి నష్టాన్ని తగ్గించుకోవచ్చు. ఉదాహరణకు ఉరుములు, మెరుపులు వున్నప్పుడు కొందరు ఆంజనేయ దండకాన్ని జపిస్తారు. ఆక్షణంలో మితిమీరిన భయం మనలను వివశులను చేస్తుంది. అప్పుడు ఆ భయానికి తావులేకుండా ఆంజనేయ దండకాన్ని ప్రవేశపెట్టితే భయం తగ్గుతుంది. ప్రపంచాతీతశక్తి ఆంజనేయ దండకం చదువుచున్నప్పుడు మనని రక్షించదు. మనలో ఉత్పన్నమయిన భయాన్ని మనమే ఆలోచనలను మళ్ళించడం ద్వారా తగ్గించుకో గలుగుతాం. తత్ఫలితంగా మన మనస్సు యొక్క పనితీరులో మార్పు వస్తుంది. ఆ మార్పును ప్రపంచాతీత శక్తి కలిగించిందనే నమ్మకంతో మళ్ళీ మళ్ళీ అట్టి అలవాటును అసంకల్పితంగా చేస్తాం. మన ఆలోచనలను ముందుగా నిర్ణయించిన మార్గాలలో పయనింపజేస్తే, భయంవల్ల కలిగే నష్టాన్ని తగ్గించవచ్చు. ఇట్టి ప్రక్రియలకు నమ్మకాలు, విశ్వాసాలు తోడ్పడ్తాయి. కాని మూఢ నమ్మకాలు, అనాచారాలు, నిర్హేతుక విశ్వాసాలు మనకు తీరని హానిని కలుగజేస్తాయి. అందువల్ల మనకు సహజంగా కలిగే ఇబ్బందికరమయిన ఆలోచనలను ముందుగానే ఊహించి, వాటిని ఏఏ మార్గాలలో మళ్ళించాలో పథకాలను రూపొందించుకోవాలి. అట్లా సిద్ధం చేసుకొన్న ఆలోచనలను సమయస్ఫూర్తితో అమలు జరపాలి.

మన ప్రవర్తన చాలావరకు చిన్ననాటి అనుభవాలపై ఆధారపడి ఉంటుంది. చిన్న తనంలో భయం కలిగినప్పుడు ఆంజనేయ దండకాన్ని చదివి భయాన్ని పోగొట్టుకోవటానికి అలవాటు పడతాం. ఆ అలవాటునే పెద్దయిన తరువాతకూడ అప్పుడప్పుడు అసంకల్పితంగా వుపయోగించుకొంటూ వుంటాం. కొంతమంది తమ అభిమాన వ్యాపకంలో నిమగ్నమైనప్పుడు ఆపనిలో ఏకాగ్రత కలిగి వుంటారు. అట్టి సందర్భాలలో పరిసరాలలో జరిగే సంఘటనలు వారి ఆలోచనలలో చోటు చేసుకోవు, ఉదాహరణకు రేడియో వింటూ, దిన పత్రికను చదువుచున్నప్పుడు రేడియోలో వినిపించే అంశాలకు మనం ప్రాధాన్యం ఇస్తే దినపత్రికలో చదివిన విషయాలు మనకు ప్రేరణ కలుగచేయలేవు. ఒకవేళ దినపత్రికలోని అంశాలు ఆసక్తిదాయకంగా వుంటే రేడియో అందించే సమాచారం మనకు వినబడదు. అట్లాగే మనకిష్టమైన క్రీడలను చూస్తున్నప్పుడు ఇబ్బందికరమైన ఆలోచనలు మన స్ఫురణలోకి రావు. సంగీతము నందు అభిరుచి కలవారు పాటలు పాడుతున్నా, లేక తమకిష్టమైన పాటలు వింటున్నా ఉల్లాసంగా కాలం గడుపుతారు. అందువల్ల ఆలోచనలను ముందుగా నిర్ణయించిన పథకం ప్రకారం పయనింపజేస్తే మనకు తరచు ఎదురయ్యే మానసిక సంక్షోభాన్ని కట్టడి చేయవచ్చు.

ప్రతి ఒక్కరు తమ లక్ష్యాలను వాస్తవాలకు దగ్గరగా నిర్ణయించుకొని వాటిని సాధించే పద్ధతులను పథకాలుగా రూపొందించుకోవాలి. పథకాలను తయారు చేసుకొనేటప్పుడు తమ శక్తిసామర్థ్యాలను సరిగ్గా అంచనా కట్టుకోవాలి. తమ లోపాలను గుర్తించి అవి తమ కార్యక్రమాలకు అడ్డు తగలకుండా వుండే విధంగా కృషి చేయాలి. ఇతరుల నుండి లభించవలసివున్న సహాయ సహకారాలను సరిగ్గా అంచనాలు వేసుకోవాలి. వాతావరణంలోని అనుకూల పరిస్థితులను, పోటీని ఎదుర్కొనే వ్యూహాలను ముందుగానే రూపొందించుకోవాలి. ఎదురు చూడని పరిస్థితులు తటస్థపడ్తాయనే వాస్తవాన్ని దృష్టిలో పెట్టుకొని, పథకాలను తగు అదనపు వనరులతో తయారు చేసుకోవాలి. ఎంత ఎక్కువ శ్రద్ధతో వ్యూహాలను రూపొందించుకొంటే

అంత ప్రయోజనం వుంటుంది. ప్రతి ఒక్కరు తమ ఆలోచనా శక్తినంతా, తమ లక్ష్యాలను అందుకోవడానికి ఏకాగ్రతతో వినియోగించితే విజయావకాశాలు మెరుగుపడ్తాయి.

ముందుగా నిర్ణయించిన పథకాలను అమలు పరచటంలో మనస్సును పూర్తిగా లగ్నం చేయాలి. మనస్సు సహజంగా గతాన్ని గూర్చిగాని, భవిష్యత్‌ను గూర్చిగాని ఎక్కువగా ఆలోచించటానికి ప్రేరణలను కల్పిస్తుంది. అందువల్ల చేతిలోని పనిని అశ్రద్ధ చేయడం జరుగుతుంది. ఉదాహరణకు కొంతమంది గృహిణులు భర్తతో ఏర్పడిన వాగ్వివాదాన్ని గూర్చి ఆలోచిస్తూ, అత్త సాధింపులను గుర్తుకు తెచ్చుకొని, ఆడబిడ్డల వెక్కిరింపును జ్ఞాపకం చేసుకొంటూ, తోడికోడలును గూర్చి ఈర్ష్యపడ్తూ, పిల్లల చదువును గూర్చి ఆందోళన చెందుతూ, కూరలో కారం వేసిన విషయాన్ని మర్చిపోయి మళ్ళీ కారంవేసి కూరను ఘాటుగా వండుతారు. కారాన్ని తగ్గించటానికి నిమ్మకాయను పిండి సరిదిద్దటానికి కృషి చేస్తారు. అట్లాగే కొంతమంది ఉద్యోగస్థులు పై అధికారుల అనౌచిత్య ప్రవర్తనను గూర్చి ఆలోచిస్తూ, క్రింది ఉద్యోగస్థుల క్రమశిక్షణా రాహిత్యాన్ని సరిదిద్దటానికి వ్యూహాలను రూపొందిస్తూ, సహ ఉద్యోగుల సహాయనిరాకరణను గూర్చి విచారిస్తూ, తమకు ప్రమోషను వస్తుందో రాదోనని ఆందోళన చెందుతూ, చేతిలోని పనికి న్యాయం చేకూర్చ లేకపోతారు. కొన్ని ముఖ్యమయిన పనులను వాయిదా వేస్తారు. ఇట్లా మనస్సు కార్యనిర్వహణ సామర్థ్యాన్ని కుంటుపరుస్తూ వుంటుంది. మనం గతాన్నిగూర్చి భవిష్యత్తును గూర్చి ఆలోచించవలసిన అవసరం వుంది. కాని దానికి అవసరానికి మించి కాలాన్ని వెచ్చించి ప్రస్తుత కర్తవ్యాన్ని నిర్లక్ష్యం చేయవలసిన అవసరం లేదు. ప్రతి ఒక్కరు తమ ప్రాముఖ్యాలను ప్రాధాన్యములను ఖచ్చితంగా నిర్ణయించుకునేటప్పుడు అన్ని విషయాలను సంపూర్ణంగాను, సమగ్రంగాను పరిశీలించాలి. అట్టి నిర్ణయాలు చేసిన పిదప వాటిని అమలు చేయటానికి కృషి చేయాలి.

మన ప్రాధాన్యాల ప్రకారం కార్యక్రమం చేపట్టినప్పుడు మనస్సు మనలను గతాన్ని గూర్చో, భవిష్యత్తును గూర్చో మళ్ళి ఆలోచించేటట్లు చేసి చేతిలోని పనిని చెడగొట్టుతుంది. అట్టి సందర్భాలలో మెలకువతో మనస్సును తమ లక్ష్యంవైపు మళ్ళించుకోవడానికి ప్రయత్నం చేయాలి. చిన్నప్పటి నుండి అప్రస్తుత విషయాలకు ప్రాధాన్య మివ్వటానికి అలవాటు పడ్డవారు, తమ అలవాటు ప్రకారం కాలాన్ని వృథా చేయటానికి ప్రయత్నిస్తారు. అట్టి సందర్భాలలో వారి మనస్సు వారు చేస్తున్న పని సరియైనదేననే అభిప్రాయాన్ని కలుగజేస్తుంది. పరిస్థితులు తమని ప్రేరేపిస్తున్నాయని నిందారోపణ చేస్తూ తమ లోపాన్ని సమర్థించుకొంటారు. అందువల్ల చేసిన తప్పును మళ్ళీ మళ్ళీ చేస్తూ తమలోపాన్ని సరిదిద్దుకోవడానికి కృషి చేయరు. అసలు అలవాటు మెత్తని పరుపులాంటిది. ఒకసారి పడుకున్న తరువాత లేవబుద్ధి పట్టదు. బద్ధకంగా పరుపుపై పడుకొని, లేవడానికి ఇష్టపడనివారిలాగా, చెడు అలవాట్లు వున్నవారు వాటిని విడిచి పెట్టటానికి ఇష్టపడరు. కాని ఇతరులుగాని, పరిసరాలుగాని మారాలని కోరుకొంటారు. అసలు సమస్యను సృష్టించింది తామే కాబట్టి దాని పరిష్కారానికి తామే బాధ్యులమనే విషయాన్ని మనస్సు అధీనంలో వున్నవారు తెలుసుకోలేరు. మన మనస్సు మనకు సేవలను అందించుతుంది. కాని దానిని సరిగ్గా ఉపయోగించకోలేని వారిని మనస్సు యజమానిలాగే అజమాయిషి చేస్తుంది. ప్రతి ఒక్కరు మనస్సు తమని అజమాయిషి చేసే సందర్భాలను గుర్తించే నేర్పును కలిగి వుండాలి. అట్టి

పరిస్థితులలో మనస్సును మలచుకొనే వ్యూహాలను చేపట్టి తమ లక్ష్యసాధనకు మనస్సును ఉపయోగించుకోవాలి.

మనం ఎనిమిది పనులలో విజయం సాధించి రెండు పనులలో వైఫల్యం చెందిన సందర్భాలలో మన మనస్సు మన లోపాలను మనదృష్టికి తెచ్చి విజయ పరంపరలనుండి లభించిన సంతోషాన్ని అనుభవించనివ్వదు. లోపాలనుండి గుణపాఠాలు నేర్చుకోవలసిన అవసరం వున్నప్పటికి దానికి వినియోగించవలసిన కాలాన్ని పరిమితి చేయవలసిన అవసరం వుంది. ఎప్పుడు వ్యతిరేక ధోరణిలో వైఫల్యాలను గూర్చి ఆలోచిస్తూ కాలాన్ని వృథాగా గడిపితే విజయావకాశాలు తగ్గిపోతాయి. లోపాలను గుర్తించి వాటిని నివారించటానికి వ్యూహాలను తయారు చేసుకొనడంతోపాటు విజయాన్ని సాధించిన సందర్భాలను కూడ సమీక్షించి అదే పనిని ఇంకా బాగా చేసే విధానాలను గూర్చికూడ ఆలోచించాలి. ఇట్లా నిర్మాణాత్మకంగా శక్తి సామర్థ్యాలను అంచలవారిగా వృద్ధిచేసుకోవాలి. ఒకవేళ అలవాటు ప్రకారం మనస్సు వ్యతిరేకపు ఆలోచనలను ప్రేరేపిస్తూ వుంటే, మనకు సంతోషాన్ని సంతృప్తిని గతంలో కలిగించిన సన్నివేశాలను బలవంతంగా మన ఆలోచనలలోనికి ప్రవేశపెట్టాలి. ఇట్టి వ్యూహాన్ని ముందుగానే ఆలోచించి సిద్ధపర్చుకోవాలి. మన ఆలోచనలను వ్యతిరేకపు ధోరణిలో పోనియ్యకుండా అడ్డుకట్టలు వేసి మన వ్యూహం ప్రకారం మన అభిమాన ధోరణిలో నడిపించాలి. అప్పుడు అపసవ్య ఆలోచనలను నెట్టివేసి సవ్యంగా ఆలోచించే సావకాశం ఏర్పడ్తుంది. ఇట్లా సవ్యంగా ఆలోచించుకొని లక్ష్యంవైపు మనస్సును మళ్ళించగలిగితే విజయావకాశాలు మెరుగవుతాయి. ప్రథమదశలో ఇట్టి ప్రయత్నానికి అనేక అడ్డంకులు ఏర్పడ్తాయి. క్రమ క్రమంగా మనస్సు మన అధీనంలోనికి వస్తుంది.

మన ఆలోచనలను సవ్యమార్గంలో నడిపించటానికి ప్రప్రథమంగా మన లోపాలను గుర్తించగలగాలి. ఒక్కసారే అన్ని లోపాలను సరిదిద్దలేం. ప్రథమ దశలో చిన్న లోపాన్ని సరిదిద్దటానికి కృషి చేయాలి. అట్టి ప్రయత్నంలో విజయం సాధించి, ఆ విజయంవల్ల లభించిన ప్రోత్సాహాన్ని అదనపు వనరుగా వినియోగించుకొని, అంచలువారిగా ముందుకు సాగాలి. అపసవ్య ఆలోచనలకు ఎక్కువ ప్రాముఖ్యమునిచ్చి వాటిని గురించే తరచూ బాధపడుతూ వుంటే అవి స్థిరపడిపోతాయి. ఉదాహరణకు సిగరెట్టు కాల్చాలనే ఆలోచన వచ్చినప్పుడు సిగరెట్టు త్రాగకూడదనే నిర్ణయాన్ని అమలు పర్చటంవల్ల ఎక్కువ ప్రయోజనం వుండదు. అట్టి కృషిని నిరోధించటానికి సిగరెట్టు కాల్చాలనే వాంఛ మరింత గాఢంగా ఏర్పడ్తుంది. చివరకు సిగరెట్టు కాల్చకూడదనే నిర్ణయాన్ని అమలు పర్చలేకపోతాం. అందువల్ల చెడు అలవాటు బదులు ప్రవేశపెట్టదల్చుకొన్న మంచి అలవాటును ఎక్కువగా ఆలోచించాలి. సిగరెట్టు కాల్చకూడదనే ఆలోచన బదులు సిగరెట్టు మానివేస్తే ఆదా అయ్యే డబ్బును మనకు లాభం చేకూర్చే విధానాలలో ఖర్చు పెట్టటానికి వ్యూహాలను రూపొందించుకోవాలి. అట్లాగే అనారోగ్యాన్ని పారద్రోలటానికి అయ్యే ఖర్చును కూడ పరిగణనలోకి తీసుకోవాలి. ఆ మొత్తాన్ని అదనపు రాబడిగా గుర్తించి తమకు కలుగబోయే లాభాన్ని ప్రత్యక్షంగా పొందుతున్న అనుభూతిని స్మరణలో వుంచుకోవాలి. ఇట్లా తరచూ తమకు కలిగే లాభాన్ని పరిగణనలోకి తీసుకొని తాము చేసే మంచి పనిని అభినందించుకొంటూ తమలో వచ్చే మార్పును సూక్ష్మంగా గమనిస్తూ పురోగమిస్తే ఆలోచనలు మన అదుపులో వుంటాయి. ఎప్పుడూ మన లోపాలను గుర్తు చేసుకొంటూ మన అశక్యత వివరించుకొంటూ

జీవితాన్ని గడిపితే అపసవ్య ఆలోచనలు మనని విడిపోవు. పైపెచ్చు వాటిని సమర్థించుకొనే స్వభావం కూడ స్థిరపడి పోతుంది. ముఖ్యంగా మన బాహ్య మనస్సు ఎట్లా ఆలోచింపితే అంతర్ మనస్సు అట్లాగే ఆలోచించటానికి ప్రయత్నిస్తుంది. అపసవ్య ఆలోచనలు అంతర్ మనస్సు నుండి ప్రేరేపించబడ్తాయి. కాబట్టి వాటిని మళ్ళించటానికి బాహ్యమనస్సు ద్వారా మాత్రమే సాధ్యమౌతుంది. బాహ్య మనస్సులో నిరంతరం నిర్మాణాత్మకమయిన సవ్య ఆలోచనలు మెదులుతూ వుంటే, వాటి ప్రభావం క్రమక్రమంగా అంతర్ మనస్సుపై పడుతుంది. కొంతకాలానికి బాహ్య మనస్సులో మెదిలే ఆలోచనలకు అనుగుణంగా అంతర్ మనస్సులో మార్పులు కలుగుతాయి. ఈ మార్పులు మెల్లగా వస్తాయి కాబట్టి సూక్ష్మంగా పరిశీలించితే తప్ప ఎవరికి వారు వాటిని గుర్తించలేరు. కాని ప్రతి అంశాన్ని వ్యతిరేక ధోరణిలో చూచి అపసవ్య ఆలోచనలను ఉత్పత్తి చేసుకొనే అలవాటు వున్న మంచి ఆలోచనలు వచ్చే సావకాశం లేదు. మంచి ఆలోచనలను బాహ్య మనస్సులో ప్రేరేపించి వాటిని అంతర్ మనస్సులోకి చొప్పించటానికి ప్రయత్నించితే, అపసవ్య ఆలోచనల ప్రభావాన్ని తగ్గించటానికి ప్రయత్నించితే, అపసవ్య ఆలోచనల ప్రభావాన్ని తగ్గించటానికి వీలుంది. మన ఆలోచనలలో ఎక్కువ భాగాన్ని పరిస్థితులను, సంఘటనలను, వ్యక్తులను సాదరంతో పరిశీలించే మార్గంలో పెడితే అపసవ్య ఆలోచనలను సవ్య మార్గంలో మళ్ళించటానికి వీలు కలుగుతుంది. ఇట్టి ప్రయత్నానికి మన వైఖరిలో మార్పు రావాలి. ఎవరికివారు తమ వైఖరిలో మార్పు తీసుకురావటానికి కృషి చేయవచ్చు. ఇట్టి కృషి జీవిత లక్ష్యంగా చేపట్టినప్పుడు మనస్సును మన అధీనంలో వుంచుకోవచ్చును. ★

For the '90s person who wants more than the joys of epidermal renewal, ingrafted collagen and free radical protection, beauty hype has begun packaging conscience, ethics and morality, at a price. Creams and lotions plug positive values. Make-up is tagged 'cruelty-free' and 'environment-friendly'.

Statesman

"During the past 100 years, we have made almost unbelievable material and social progress - What has not changed is the nature of humanity and our never ending challenge."

TIME

**For a politician "Honesty isn't enough. One has to solve problems too."**

# విద్వేషము లేనే లేదు ఉన్నది వివేచనయే

కందుకూరి వారిపై వచ్చిన వివాదాస్పదమైన వ్యాసాలు దీనితో ముగింపు.

– మిసిమి

– చీమకుర్తి శేషగిరిరావు

నవంబరు 'మిసిమి'లో 'మధురవాణితో వీరేశలింగం పంతులు' అను శీర్షికన వెలువడిన ఒక రచనలో 'మంగమ్మ ఉదంతము'ను గురించిన వివరణలు కొన్ని తెలుపబడినవి. అవి అసమగ్రములు. కావున యథార్థ విషయములను తెలియజేయుట నావిధిగ భావించి, వానిని తెలియజేయుచు ఒక పేజీ విస్తృతి కలిగిన ఒక లేఖను డిశంబరునెల 'మిసిమి'లో ప్రచురింపజేసితిని. దానిని విమర్శించుచు డాక్టరు అక్కిరాజు రమాపతిరావుగారు యెనిమిది పుటల విస్తృతిగల ఒక సుదీర్ఘ వ్యాసమును 'వీరేశలింగంపై విద్వేషం ఎందుకు?' అనే శీర్షికతో వ్రాసి 1992 ఫిబ్రవరి 'మిసిమి'లో ప్రచురింప జేసిరి. ఇది పూర్వగాథ.

ఇక ప్రస్తుత విషయము. రమాపతిరావుగారు వ్రాసిన వ్యాసమును ఆమూలాగ్రము శ్రద్ధగా చదివితిని. నేను తెలియజేసిన కోర్టు వ్యవహారాలనుగాని, వీరేశలింగంగారు చెల్లించిన జరిమానా విషయమునుగాని వారు కాదనలేదు. అయినను ఎందులకో వీరేశలింగం పంతులుపై నాకు విద్వేషము ఉన్నటుల ఆరోపించిరి. కారణమే చూపించని ఈ ఆరోపణకు సమాధానము ఏ విధముగ ఉండగలదు? ఈ పరిస్థితిలో ఒక విషయమును మాత్రము చెప్పగలను. 'మంగమ్మ ఉదంతము'న నేనొక అభిప్రాయమునకు వచ్చుటకు తోడ్పడినది విద్వేషము కాదు; వివేచన.

నేను చెప్పిన యథార్థ విషయములను కాదనలేక, 'శేషం కోపేన పూరయేత్' అను న్యాయమును అనుసరించి, టంగుటూరి శ్రీరాములు మీదను, నాళం కృష్ణారావు మీదను, రామచంద్రుని వెంకటప్ప మీదను బురద చల్లి డాక్టరుగారు సంతృప్తి పడిరి. ఆ ముగ్గురును ఈ లోకమున లేరు కావున బదులు చెప్పలేరను ధీమాతో రమాపతిరావుగారు వారిని నిందించిరి. ఇక నేను బ్రతికి యున్నాను గదా! అందువలన నన్ను మినహాయించుచు 'చీమకుర్తి శేషగిరిరావుగారి వంటి పెద్దలను గురించి కాదు' అని వ్రాసిరి. ఇటుల అనుచునే నన్ను అధిక్షేపించుచు వ్యంగ్యరీతిలో వ్రాసిరి. ఆ అధిక్షేపములను ప్రస్తుతమున ఆవలనుంచి, రమాపతిరావుగారు నాకొసగిన పెద్దరికమును పైన వేసికొని వారికై కొన్ని హితోక్తులను తెలుపవలసి యున్నది.

అందులకు పీఠిక: దేశచరిత్ర, జీవిత చరిత్ర అనునవి తెలుగు రచయితలకు, ఆంగ్ల సాహిత్య పరిచయమువలన నూత్నముగ లభించిన ప్రక్రియలు. ప్రబంధముల తీరున నడచునవి ఇవి కావు. విజ్ఞానశాస్త్ర పరిశోధకుడు సాగించు కృషికి సన్నిహితమగునది ఇందులకై సాగును. శ్రుతములు, లిఖితములునగు సామగ్రులను - వీనికై సేకరించవలెను; వానిని తగురీతిలో, సమన్వయించవలెను. ఈ సమన్వయ సాధనలో, మణిగణమున సూత్రమువలె, సత్యాన్వేషణ సంబద్ధమై యుండును. ఇట్టి సత్యాన్వేషణ, విజ్ఞానశాస్త్ర పరిశోధకుడు అవలంబించు రీతిలోనే ముందుకు సాగును. ఇట్టి కృషి సాగెడు రీతిని గురించి 'తామస్ హక్స్‌లీ' అను ఆంగ్ల పండితుడు ఇటుల వ్రాసెను.

"Sit down before fact as a little child, be prepared to give up every conceived notion, follow humbly wherever and to whatever abysses nature leads you or you shall learn nothing.'

ఇట్టి సత్యాన్వేషణ ఒకప్పుడు అనాకాంక్షితములు, అనూహ్యములు అగు సీమలలోనికి రచయితను కొనిపోవ వచ్చును. రచయిత వానిని ఆమోదించి గ్రహించవలసినదే. అటులగాక తన అభిరుచులకు, అభినివేశమునకు, పూర్వ నిశ్చితములగు అభిప్రాయములకు అనుగుణముగ వానిని మలచుటకు రచయిత యత్నించినచో, అతడు మానవ జాతికే ద్రోహము చేసినవాడగును.

రమాపతిరావుగారు వీరేశలింగం పంతులుగారి జీవితచరిత్ర రచనలో ఈ పంథాను అవలంబించినవారు కారు అనుటను, నా లేఖపై వారు వ్రాసిన ఈ విమర్శనయే రుజువు చేయుచున్నది. ఆయన మున్ముందుగనే పంతులు గారిని గురించి కొన్ని అభిప్రాయములను ఏర్పరచుకొన్నారు. పంతులుగారు డాక్టరుగారి దృష్టిలో 'త్రికరణశుద్ధి కలిగిన మహాపురుషుడు', 'మహాత్యాగి', 'కారుణ్యమూర్తి'. అనగా ఒక నిశ్చితాభిప్రాయానికి ముందేవచ్చి రచనను వారు సాగించిరనుట సుస్పష్టము. ప్రబంధముల వాసననుండి డాక్టరుగారు విముక్తులు కాకుండుటయే ఇందులకు ఒక ముఖ్య కారణము. ప్రబంధమున కృతిభర్త, మూడుగ్రామముల మొఖాసాదారైనను, అతడు ప్రబంధ రచయిత దృష్టిలో 'చతురంభోధి పరీత భూవలయ భర్త'. ఇక ప్రబంధపు కథానాయకుడు ధీరోదాత్తుడు, సర్వ సద్గుణ నిధి. ఈ తత్త్వమే డాక్టరుగారిని జీవితచరిత్ర రచనలో కూడ ముందునకు నడిపించి, సత్యాన్వేషణకు దూరము చేసినది.

మానవుడు దేవుడు కానేరడను విషయమును, ఇట్టి జీవితచరిత్రల రచనలో విస్మరింపరాదు. ఎన్నో తప్పుటడుగులు వేసిన పిదపనే ఎట్టి ప్రసిద్ధ వ్యక్తియైనను ఒక సువ్యవస్థితమగు మార్గమును తనకై ఏర్పరచుకొనగలుగును. అటుల ఏర్పరచుకొనిన తరువాత గూడ, ఎడనెడ, అవశముగనైనను తప్పులను చేయును. ఈ విషయమునే మన పెద్దలు పురాణములలో మహర్షుల తపోభంగములుగ వర్ణించిరి. మానవ హృదయపు లోతుపాతులను చక్కగ నెరిగి చిత్రించ నేర్చిన వేదవ్యాసుడు ఈ సత్యమునే భాగవతమున, **'బలవానింద్రియగ్రామో విద్వాంసమపి కర్షతి'** అను సూక్తివలన ప్రకటించెను.

ఆధునిక యుగమునను ఇందులకు ఎన్నియో నిదర్శనములు కలవు. బ్రహ్మసమాజ ప్రచారకుడుగ, అనుష్ఠాన శీలుడుగ, అత్యంత ప్రఖ్యాతిని ఆర్జించిన కేశవచంద్రసేనుడు, తన జీవిత సాయం సంధ్యలో, తానిడుకొనిన ఆదర్శములనుండి తానే వైదొలగి, తన పుత్రికకు బాల్యముననే వివాహము చేసెను. బ్రాహ్మ సమాజ నిష్ఠాగరిష్ఠుడు, వందేమాతరం ఉద్యమ రథసారథి, బిపిన్ చంద్రపాల్ జీవితపు చరమ సంధ్యలో తన ఆదర్శములనుండి వైదొలగెను. సత్యాన్వేషియగు గాంధిజీ, అరువదవ పడిలో, కామమునకు లోనైనటుల స్వప్నమున తనకు అనుభూతి కలిగినందులకు ఎంతయో చింతించెను. స్వీయ చరిత్రను రచించుటలో సత్యనిరతికి గల ప్రాముఖ్యమును గాంధిజీ అటుల విశదీకరించెను.

ప్రసిద్ధ వ్యక్తుల జీవిత చరిత్రలను రచించిన పాశ్చాత్య రచయితలలో పలువురు ఇట్టి సత్యాన్వేషణకే తావొసగిరి. అట్టి రచనలను ఆధారముగా చేసికొనియే మిత్రులు కొందరు

'మేధావుల మెతకలు' అను శీర్షికతో 'మిసిమి'యందు కొన్ని వ్యాసములను ప్రకటించిరి. ఇట్టి సత్యాన్వేషణవలన ఒక ప్రసిద్ధ వ్యక్తి జీవితమున ఏదైన లోటు కన్పించినను, ఆ వ్యక్తి సమాజమునకు ఏ ఒక ప్రత్యేక రంగమునందైనను సమకూర్చిన శ్రేయమును గుర్తించుటకు ఆలోటు అడ్డంకిగ ఉండదు. ఉదాహరణకు 'వోల్టయిర్' జీవిత చరిత్రను తీసికొందము. 18వ శతాబ్దిలోని యూరపున - సాహిత్య, సామాజిక, తాత్త్విక, వైజ్ఞానిక రంగములందు ప్రఖ్యాతి వహించిన మనీషి ఆతడు. కాని అతడు ఏబది యేండ్లు దాటిన వయసున కాముకతకులోనై, అక్రమ సంబంధమున పాల్గొని, ఒక యువతికి ఫ్రెంచి భాషలో వ్రాసిన ఒక ఉత్తరమును, 'విల్ డురాంట్' అను చరిత్ర రచయిత తన గ్రంథమున, ఆంగ్లానువాద ముతో కూడా ప్రచురించెను; అంతేకాదు అపరవయస్సున వోల్టయిరు తన ఆదర్శములనుండి వైదొలగిన తీరును కూడా తగు నిదర్శనములతో వెల్లడించెను. అయినను యూరప్ సంస్కృతికి వోల్టయిర్ చేసిన సేవను మదింపు చేయుటలో పై లోపములను లెక్కలోనికి తీసికొనక 'మతాంధత నుండి, అంధ విశ్వాసముల సుడిగుండమునుండి, భావ దాస్యము నుండి యూరప్‌లోని యువకలోకమును ఉద్ధరించి సక్రమమగు మార్గమును వారికి చూపిం చిన ప్రజ్ఞానిధి'గ వోల్టయిర్‌ను విల్ డురాంట్ ప్రస్తుతించెను (చూ. The Story of Civilisation Vol.IX; PP. 392, 754 & 786 )

కాని విల్ డురాంట్ వంటివారి నిష్పక్షపాత దృష్టి డాక్టరు రమాపతి రావుగారికి నచ్చదు. అందువలననే 'మంగమ్మ ఉదంతమును, పంతులుగారి లోపములను' వెలికిదీసిన టంగు టూరి శ్రీరాములును, నాళం కృష్ణరావును చెడబడ తిట్టి, పంతులుగారిపై వారిరువురకు సద్భావము లోపించుటకు, ఏవియో కారణాలను తెల్పిరి. అవి అర్థరహితాలు. 'పృష్ఠతాడనమ్, దంతభగ్నమ్' అను సామెతకు లక్ష్యాలు వారు చూపిన ఆ కారణాలు. ఆనాడు అనగా 1906 నాటికి రాజమండ్రిలోని పెద్దలందరికి వీరేశలింగం పంతులు పట్ల సద్భావము అంతరించినది. ఆయనను జారిపోయిన సంస్కర్త (Lost Reformer) గా ప్రజలు భావించిరి. 'ప్రభుత్వపు ఆదరణను, పలుకుబడిని ఆర్జించుటకు మాత్రమే పంతులుగారు కృషి చేయుచుండిరి. ప్రజా శ్రేయస్సు వారి లక్ష్యముగా'దని ప్రజలు భావించిరి. ఇది నా అభిప్రాయము మాత్రమేగాదు, డాక్టరు రమాపతిరావుగారి అభిప్రాయము కూడ అదియే. వారు వ్రాసిన ఈ క్రింది వాక్యాలను గమనించండి:

'1906 తరువాత వీరేశలింగానికి రాజమండ్రిలో అభిమానులు లేరు. అనుకూల వాతావ రణం చాల తక్కువ. యువశక్తి అంతా ఆయనకు వ్యతిరేకం. ఆయనను హేళన చేసే వాళ్లు . 'వందేమాతరం' వీరావేశంలో ఆయనను 'పిరికిపంద' అన్నారు.

అనగా రాజమండ్రిలోని ప్రజానీకమంతయు, ఏక కంఠముతో పంతులుగారిని ఆనాడు నిరసించినదనుట సుస్పష్టము. అందులకు కారణాలు ఉండి యుండును గదా! అట్టి పరిస్థితిలో టంగుటూరు శ్రీరాములు, నాళం కృష్ణరావులు మాత్రమే పంతులుగారిని ద్వేషించిరని చెప్పి, అందులకై ఏవియో సరికుదురని కారణాలను పేర్కొనడం హాస్యాస్పదము కాదా!

ఇక రామచంద్రుని వెంకటప్పగారిని గురించి వ్రాయుచు, అతని వ్రాతలన్నియు అభూత కల్పనలు అని రమాపతిరావుగారనిరి. బహుశః వారికి రామచంద్రుని వెంకటప్పగారిని గురించి ఏమియు తెలిసి యుండకపోవచ్చును. వెంకటప్పగారు 1902లో జన్మించిరి. మెట్రిక్యులేష న్‌లో నెగ్గి, ఆనాటి పరిస్థితులలో ఉద్యోగావకాశమున్నను, దానిని వదలుకొని, వంశ

పరంపరాగతమగు కఠిణీకము త్యజించి, గాంధిజీని అనుసరించి, ప్రతి ఉద్యమమున పాల్గొని, మొత్తముమీద ఆరేండ్లు 'సి' క్లాసు కారాగార జీవితమును గడపిన త్యాగ ధనుడాయన; తెలుగు సంస్కృతియన్న మితిమించిన అభిమానము కలవాడు. కాంగ్రెస్ ప్రచారకుడుగ బరంపురం మొదలుగ మద్రాస్‌వరకు ఆయన పర్యటించి, పలువురు పెద్దల జీవితపు వివరములను గ్రహించెను. రాజమండ్రిలో కొంతకాలము గడిపెను. 'కాంగ్రెస్' వారపత్రికకు ఉపసంపాదకు డుగ పనిచేసెను. క్రొవ్విడి, బ్రహ్మజోస్యుల ఆయనకు సుపరిచితులు. 'మదరాసు తెలుగు నగరము' అను పేరున ఆయన రచించి ప్రచురించిన గ్రంథము అతని చారిత్రక విషయపు పరిశోధనశక్తికి నిదర్శనము. వీరేశలింగం పంతులు గతించునప్పటికి వెంకటప్పకు 17 ఏండ్లు నిండినవి. అనగా కొంతవరకు పంతులుగారికి వెంకటప్ప సమకాలీనుడే అగును. అట్టి పరిస్థితిలో పంతులుగారిని గురించి యథార్థ విషయములను గ్రహించుటకు ఆయనకు అవకాశములు మెండుగ ఉండును గదా? దీనిని అంగీకరించరు రమాపతిరావుగారు. 1902లో పుట్టి, వీరేశలింగముగారి సమకాలీనులలో పలువురను సంప్రదించు అవకాశములను కలిగి, వారి ద్వారా సమాచారమును సేకరించిన వెంకటప్పగారి అభిప్రాయములను కాదని, వీరేశ లింగం గతించిన తరువాత దాదాపు 16 ఏండ్లకు జన్మించి, ఈ శతాబ్దపు ఏబదులలో వీరేశలింగం పంతులుగారి జీవితముపై పరిశోధనను సాగించిన రమాపతిరావుగారి అభిప్రాయా లను, నిర్ణయాలను ఎవరు విశ్వసించగలరు? వీరేశలింగం పంతులుగారిపై రామచంద్రుని వెంకటప్పకు విద్వేషము, శ్రీరాములపై సద్భావన ఎందువలన ఉండగలవు? వీరేశలింగంగారి పేరునుగాని, శ్రీరాములుగారి పేరునుగాని వాడుకొని, ఏ ఉద్యోగమును ఆయన ఆర్జించ లేదే! స్వాతంత్ర్యసిద్ధి అనంతరమున సైతము ఏ పదవినైనను ఆయన ఆశించలేదే! దారిద్ర్య మునే వరించి, త్యాగమయ జీవితమునే అభిమానించి, సరళ నిరాడంబర జీవనమును ఆయన గడపెను. ఆయనను అసత్యవాది అని నిర్హేతుకముగ ఆరోపించడం డాక్టరుగారికే తగినది.

ఇక 'వీరేశలింగం చుట్టూ కొందరు పన్నిన కుట్ర ఫలితమే ఈ అపవాదు అని రుజువు చేయడానికి బోలెడన్ని సాక్ష్యాధారాలున్నవి' అని డాక్టరుగారు సెలవిచ్చిరి. కాని నిర్దిష్ట రీతిలో ఏ రుజువును చూపలేకపోయిరి. అయినను ఒక విచిత్ర వాదనను లేవదీసిరి. అది:

'టంగుటూరి శ్రీరాములు కాని, నాళం కృష్ణారావు కాని, రామచంద్రుని వెంకటప్పకాని ఆనంద గార్డెన్స్‌లో మేడగదిలో వీరేశలింగం, మంగమ్మల కాముక కృత్య దృశ్యం చూశారా!'

అనగా రమాపతిరావు గారికి వ్యభిచారాన్ని గురించి కావలసినది ప్రత్యక్ష సాక్ష్యం, లేదా దానిని తెలియజేసే ఒక ఛాయాపటము. ఇట్టి వ్రాతలను వారెటుల వ్రాసిరో నాకర్థమగుటలేదు. క్రోధము మనస్సును లోగొనుటవలన తాను వ్రాయుచున్నది ఎట్టిదను విషయమును గ్రహించలేని స్థితిలో వారు దానిని వ్రాసియుందురు. నాయనా, రమాపతిరావు గారూ వ్యభిచారాన్ని మనవారు 'చీకటి తప్పు' అని వ్యవహరింతురు. పత్రికలవారిని, సాక్షులను, కెమెరాలతో, ఫ్లాష్ లైట్లతో ఫోటోగ్రాఫర్లను పిలిచి ఆ దుష్కార్యమును నిర్వర్తించరు. కోర్టులో అట్టి నేరముల నిర్ణయాలకు అనుసరించు పద్ధతులు కొన్ని ఉన్నవి. నిందితుడగు వాని వాఙ్మూలము, నేరము చేసినటుల భావించుటకు వీలుపడు పరిసర విషయాలు అందుకు తోడ్పడును. అది సరియే, ఈ ప్రశ్న వేసినందులకు ప్రత్యామ్నాయముగ ఎవరైనను డాక్టరుగారిని నిలువదీసి,

'అయ్యా, తాము నోటు బుక్కును, పెన్సిలును తీసికొని వీరేశలింగం గారిని, మంగమ్మను వారి శయ్యా, ఆసన, భోజన, విహార, నిద్రా సమయములందు అనుగమించి నోట్సు వ్రాసికొని, దాని ఆధారమున గ్రంథమును వ్రాసితిరా' అని అడిగిన వారేమనెదరు?

ఇంతటితో డాక్టరుగారి ఆవేశము ఆగినది కాదు. కోర్టులను కూడా చెడ తిట్టిరి. అందులకై ఏవో లోకోక్తులను ఉద్ఘాటించిరి. ఏవో కొన్ని ప్రత్యేక సంఘటనలను పురస్కరించుకొని రూపొందెడి సత్యాభాసములగు లోకోక్తులను ఆధారములుగ గ్రహించి సామాజిక వ్యవస్థను వ్యాఖ్యానింప యత్నించు రచయిత ఎట్టివాడగును? 'పిల్లి ఎదురు వచ్చిన పనిగాదు' 'నగచ్ఛేత్ బ్రాహ్మణ త్రయమ్' - ఇట్టి సామెతలు సామాజిక వ్యవస్థను శాసించగలవా? కోర్టులను నిందించుచు ప్రకాశంగారు ఒక ప్రత్యేక సందర్భమున అన్నమాటలను పరమ ప్రమాణములుగ గ్రహించి రమాపతిరావుగారు న్యాయ వ్యవస్థనే నిందించిరి. ఆ ప్రకాశం పంతులుగారే, ఆంధ్రరాష్ట్ర ప్రథమ ముఖ్యమంత్రిగ రాష్ట్రమునకు ఒక హైకోర్టును ఏర్పరచిరే! దానిని ఎటుల డాక్టరుగారు వివరించెదరు?

రమాపతిరావుగారు న్యాయ వ్యవస్థను నిందించుచు పేర్కొనిన సామెతలకన్న వారికి ఉపకరించడంలో మిన్నయైనవి కొన్ని సామెతలు ఉన్నవి. వానిలో ముఖ్యముగ పేర్కొన దగినది '**బ్రహ్మ సత్యము, జగత్తు మిథ్య**' అనునది. దానిని వారు అనుసరించుచో వీరేశలింగం, మంగమ్మ, వ్యభిచారము, కోర్టుకేసులు అన్నియు మిథ్యలై వారి వాదము నెగ్గగలదు.

న్యాయవ్యవస్థను ఈవిధముగ నిందించిన రమాపతిరావు గారు తమ స్వత్వములను, తమ ఆస్తిని ఎవరైనా అపహరింపజూచిన న్యాయస్థానమును ఆశ్రయించక ఊరుకొందురా? తప్పక ఆశ్రయింతురు. సామాజిక వ్యవస్థకు మూలాధారము న్యాయస్థానము. శాసనము దేశకాల పరిస్థితిని అనుసరించి మారవచ్చును. కాని, దానిని వ్యాఖ్యానించు న్యాయస్థానము మాత్రము తన ప్రతిపత్తిని కోల్పోవదు.

ఇక వీరేశలింగంగారి మరణానంతరం వారిని ప్రశంసించుచు వారి ప్రతిస్పర్థులిచ్చిన కితాబులను కొన్నిటిని డాక్టరుగారు తెలియజేసిరి. చచ్చినవానిని అందరును మంచివాడనే అనెదరు. ఈనాడు మనము ఎన్నో అట్టి సంఘటనలను చూచుచున్నాము. ఇద్దరు ప్రసిద్ధ వ్యక్తులు బ్రతికి యుండినంత కాలము ఒకరినొకరు నిందించుకొనెదరు; స్పర్థ వహించి, ఒకడు వేరొకనిని ఉన్నత పదవినుండి పడగొట్టుటకు యత్నించును. ఇక అందు ఒకడు మరణించినపుడు మిగిలినవాడు, చచ్చినవానికై ఒక అనుతాప ప్రకటనను చేయుచు 'దేశము ఒక ప్రముఖ వ్యక్తిని, దేశసేవకుని, త్యాగశీలుని కోల్పోయె'నని అనును. ఇట్టి సానుభూతి వాక్యాలను, సన్మాన సభలలోని ప్రశంసాపద్యాలను ఆధారాలుగ గ్రహించి వ్రాయునవి వందిమాగధుల కైవారములగునే కాని జీవిత చరిత్రలు కానేరవు.

ఇక వారు వ్రాసిన తక్కిన విషయములను - నాపై అధిక్షేపణలు మొదలగు వానిని - నేను పట్టించుకొన దలచలేదు. ఒక విషయము మాత్రము చెప్పక తప్పదు. వారు వ్రాసిన దానిలో స్వోత్కర్ష అత్యధికము, పరనింద అపారము, హేతువాద బద్ధత శూన్యము.

ఇక మంగమ్మ వ్యవహారమునకు రాక తప్పదు. ఇప్పుడు కామరాజుగడ్డ మంగమ్మ గాని, కందుకూరి వీరేశలింగం పంతులుగాని మనమధ్య లేరు. ఉన్నవి వారికి సంబంధించిన పత్రాలు, వానివలన తెలియనగు విశేషాలు. అవి:


1. వీరేశలింగం గారి శీలభ్రష్టతను గురించి ఒక ప్రథ చెలరేగినది.
2. మంగమ్మతో ఆయనకు అక్రమసంబంధము ఉన్నదనువార్త తొలుత పంతులుగారి వితంతు శరణాలయంలోనే వ్యాపించినది.
3. టంగుటూరి శ్రీరాములు దానికి లిఖితరూపము కల్పించెను.
4. శ్రీరాములు తనపై అసత్యపు ఆరోపణ చేసెనని వీరేశలింగం పంతులు మేజిస్ట్రేటు కోర్టులో కేసు పెట్టెను.
5. ఆ కేసు విచారణకు వచ్చి, విచారణయు, లాయర్ల వాదములును ముగిసిన తరువాత వీరేశలింగం పంతులు తన అభియోగమును తానే ఉపసంహరించుకొని, తన వాదమును వదలుకొనిరి.

ఈ పై విషయాల యాథార్థ్యమును డాక్టరు రమాపతిరావుగారును అంగీకరించిరి. ఇక పైవానిపై విజ్ఞుడు ఎవడైనను చేయగలుగు నిర్ణయమును వేరే చెప్పనక్కర లేదుగదా! శ్రీరాములు వ్రాసినది అబద్ధమని అన్నపంతులు, తన వాదమును తానే వదలుకొన్నప్పుడు శ్రీరాములు వ్రాసినది యథార్థమని పబ్లిక్ కోర్టులో అంగీకరించినటులే గదా!

ఇక ఈ ఉపసంహరణను గురించి డా. రమాపతిరావుగారు చెప్పేడివి అర్థరహితాలు. ప్రకాశంగారి వాదపటిమకు లొంగవలసివచ్చి వీరేశలింగం పంతులు అటుల చేసెనని వారి వాదము. క్రింది కోర్టులో అభియోగము తెచ్చినవాడు తనకు న్యాయము జరుగలేదని భావించినపుడు హైకోర్టునకు అప్పీలునకు పోవచ్చును గదా! కొమ్ములు తిరిగిన లాయర్లను పెట్టుకొనవచ్చునుగదా! అటులగాక కేసును ఎందులకు ఉపసంహరించుకొనెను? అందులకు ఒకే ఒక కారణమును చెప్పవచ్చును. తీగ లాగిన డొంక కదలునను రీతిగ జడ్జిమెంటులో తన ప్రవర్తనను గురించి ఇంకేదేది వ్రాయబడునో అని శంకించియే తన దోషమును వీరేశలింగం ఒప్పుకొనెను. ఆ ఒప్పుదలకు ఫలితముగనే కోర్టు వీరేశలింగం పంతులుగారికి జరిమానా విధించుటయు వారు దానిని చెల్లించుటయు జరిగినవి.

ఇక వీరేశలింగం పంతులు ఒప్పుకొనినను, తాను మాత్రము ఒప్పుకొనునని రమాపతిరావు గారు అనవచ్చును. అప్పుడది ఔచిత్యాన్ని అతిక్రమించిన అభినివేశానికి తార్కాణముగ మాత్రమే నిలువగలదు.

తుది నొక మాట. వీరేశలింగం పంతులుగారు కొన్ని రంగములందు చేసిన సేవా విశేషములను లెక్కించుటకు ఈ మంగమ్మ ఉదంతము అడ్డురాదు. సంఘసంస్కరణలో- అందునా వితంతు వివాహాల విషయమున - వారు చూపిన చొరవ ప్రశంసనీయము. క్షీణతనొంది, దిక్కు తోచని స్థితిలో ఉండిన ఆంధ్ర సాహితిని ఉద్ధరించి, ఒక నూత్న మార్గమున నిలిపి ఆయన ఆర్జించిన కీర్తిశరీరము అజరము, అమరము.★



**Rene Descartes (1596-1650)**

MISIMI/ మిసిమి RNI Regd No.45042/90 Telugu Monthly Hyderabad-500 020

Postal Regd. No.H/SD/191

# భామనే సత్యభామనే



తెరమరుగవుతున్న పురాతన కళ
తోలుబొమ్మలాటలో సత్యభామ.